ప్రజాశక్తి

సోమవారం 10 నవంబర్ 2025 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డి.రమాదేవి

ప్రభుత్వ ఆస్తుల్ని
ప్రైవేటుకు కట్టబెట్టేందుకే..

- కార్పొరేట్‌కు కట్టబెట్టాలనే కుట్రలో భాగమే పిపిపి
- మెడికల్ కళాశాలలను ప్రభుత్వమే నిర్మించాలి
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డి.రమాదేవి

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్లలో మొదలుపెట్టిన మెడికల్ కళాశాల నిర్మాణాన్ని కొనసాగించకుండా.. నిధులు ఇవ్వలేని దౌర్భాగ్య పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందా? అని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డి.రమాదేవి ప్రశ్నించారు. ప్రభుత్వ ఆస్తుల్ని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టాలనే ఉద్దేశంతోనే డబ్బులు లేవని ప్రభుత్వం తేల్చి చెబుతోందన్నారు. మెడికల్ కళాశాలలను కార్పొరేట్‌కు కట్టబెట్టాలనే కుట్రలో భాగమే పిపిపి అని పేర్కొన్నారు. ఆదివారం ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో 'బాపట్ల ప్రభుత్వ మెడికల్ కళాశాలను కాపాడుకుందాం..' అనే నినాదంతో పట్టణంలోని ఎన్జీవో హోంలో నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో వైద్య కళాశాలలను ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని డిమాండ్ చేశారు. పిపిపి విధానంలో 10 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ వైపునకు తీసుకువచ్చిన 590 జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలని ▶ 2లో

రైతులకు న్యాయం జరిగేనా.?

- నేడు జిల్లాకు కేంద్రం బృందం రాక
- కొత్తపట్నం, ఎన్‌జిపాడు మండలాల్లోనే..
- పశ్చిమ ప్రకాశంలో లేని పర్యటన

తుపాన్‌కు దెబ్బతిన్న మిర్చి పంట (ఫైల్)

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

మొంథా తుపాన్ జిల్లా రైతులకు తీరని కడుపు కోతను మిగిల్చింది. 10 వేల హెక్టార్లకు పైగా రైతులు సాగు చేసిన పంటలు నీటిపాలయ్యాయి. తుపాన్ కారణంగా దెబ్బతిన్న పంటలను పరిశీలించేందుకు సోమవారం కేంద్ర బృందం జిల్లాకు రానుంది. ఒంగోలు ప్రకాశం భవనంలో వ్యవసాయ, ఉద్యాన శాఖ, ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యుఎస్, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ ఎపిసిపిడిసిఎల్ శాఖల నష్టాలపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను సందర్శిస్తారు. కొత్తపట్నం మండలం అల్లూరు, నాగులుప్పలపాడు మండలం ఒమ్మెవరం గ్రామాలలో కేంద్ర బృందం పర్యటించి దెబ్బతిన్న పంటలు, రోడ్లు, కల్వర్లు, నీటమునిగిన చేపల చెరువులను పరిశీలించనుంది. కేంద్ర బృందం పర్యటనకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది.

తుపాన్ వల్ల జిల్లాలో సాగు చేసిన జొన్న, సజ్జ, మొక్కజొన్న, పత్తి, వరి, మినుములు, కందులు, వేరుశనగ, కంది, ఆముదం, కొర్ర, నువ్వులు, పెసలు, రాగి పంటలు.. అధికారిక లెక్కల ప్రకారం 10,274 హెక్టార్లల్లో దెబ్బతినగా, 16,500 మంది రైతులు నష్టపోయారు. ఉద్యాన శాఖ పరిధిలో మిర్చి, కూరగాయలు, ఇతర పంటలు 870 హెక్టార్లలో దెబ్బతిన్నాయి. పశు సంవర్ధక శాఖకు 19 లక్షల నష్టం వాట్లిలింది. రహదారులు దెబ్బతినటంతో ఆర్ అండ్ బి శాఖకు రూ.18.66 కోట్లు, పంచాయతీరాజ్ శాఖకు రూ.7.04 కోట్లు, రహదారులు, సిసి డ్రెయిన్స్ దెబ్బతినటంతో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు రూ.10.91 కోట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపోవటం, ట్రాన్స్ ఫార్మర్లు, ఇతర విద్యుత్ పరికరాలు నీట మునగటంతో ఎపిసిపిడిసిఎల్‌కు 3.36 కోట్లు, 47 గృహాలు దెబ్బతిన్నాయి. తుపాన్ నష్టాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వానికి కలెక్టర్ నివేదికలు పంపారు.

పశ్చిమ ప్రకాశంలో పర్యటన లేనట్టే.!

పశ్చిమ ప్రకాశంలో రైతులు సాగు చేసిన పంటలు తీవ్రంగా నష్టపోయాయి. ప్రధానంగా మార్కాపురం, పెద్దారవీడు, పొదిలి, కొనకన మిట్ల దొనకొండ, కురిచేడు, రాచర్ల, గిద్దలూరు, బేస్తవారపేట, పుల్లలచెరువు, యర్రగొండ పాలెం, వెలిగండ్ల, హనుమంతునిపాడు, మండలాలలో రైతులు వేసిన పంటలు నీటి పాలయ్యాయి. కేంద్ర బృందం పర్యటన కేవలం తూర్పు ప్రకాశంలోని కొత్తపట్నం, నాగులుప్పల పాడు మండలాలలో మాత్రమే ఉంది. దీంతో పశ్చిమ ప్రకాశం రైతులకు నిరాశ ఎదురవుతోంది.

కేంద్ర బృందం పర్యటన సాగేదిలా..

తుపాన్ కారణంగా దెబ్బతిన్న ▶ 2లో

యువతకు
ఉద్యోగాల కల్పనే ధ్యేయం

- వెనుకబడిన కనిగిరి ప్రాంతంలో ఎం.ఎస్.ఎం.ఈ పార్క్ ఏర్పాటు శుభపరిణామం
- వైసీపీ హయాంలో ప్రకాశం జిల్లాలో జరిగిన అభివృద్ధి శూన్యం
- మంత్రి స్వామి
- లింగన్నపాలెంలో సిఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

కలెక్టర్, ఎస్పీతో కలిసి సిఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి స్వామి, ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి

ప్రజాశక్తి-పిసిపల్లి

రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయస్వామి అన్నారు. ఈ నెల 11న మండలంలోని గుంటూరు లింగన్నపాలెం వద్ద ఎంఎస్ఎంఈ పార్కు ప్రారంభోత్సవానికి వస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటన ఏర్పాట్లను స్థానిక శాసనసభ్యుడు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డితో కలిసి ఆదివారం నాడు మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లపై మంత్రి అధికారులతో సమీక్షించి.. పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ వెనుకబడిన కనిగిరి ప్రాంతంలో ఎం.ఎస్.ఎం.ఈ పార్కులు, బయో గ్యాస్ ప్లాంట్లు ఏర్పాటుచేసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి స్వామి, ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి

రాష్ట్రంలోని యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా రాష్ట్రానికి పరిశ్రమలు, పెట్టుబడులు తెచ్చేందుకు సీఎం చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా కృషి చేస్తున్నారని చెప్పారు. వెనుకబడిన ప్రకాశం జిల్లా అభివద్ధికి మార్కాపురం కేంద్రంగా జిల్లాను, త్వరితగతిన వెలుగొండ పూర్తికి ప్రత్యేక ప్రణాళికలతో జిల్లా అభివద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, మంత్రి లోకేష్ కి జిల్లా ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వెనుకబడ్డ ప్రాంత అభివద్ధి కోసం వలసల నివారణ కోసం ఎన్నికలకు ముందు మంత్రి లోకేష్ యువగళం పాదయాత్ర సందర్భంగా మండలానికి వచ్చినప్పుడు వలసలు నివారణ కోసం మండల అభివద్ధి కోసం ప్రత్యేకంగా కృషి చేస్తామని ఇచ్చిన హామీ అమలుకు ప్రభుత్వం కృషి చేస్తుందని కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. లింగన్నపాలెం వద్ద తయారయ్యే వస్తువులను రామాయపట్నం పోర్టు ద్వారా ఎగుమతి అయ్యేవిధంగా అనుసంధానం చేస్తామని తెలిపారు. కలెక్టర్ పి.రాజాబాబు మాట్లాడుతూ ఇక్కడ నుండే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ▶ 2లో

సిఐటియు జిల్లా మహాసభల్లో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు

పారిశ్రామికంగా జిల్లాను అభివృద్ధి చేయాలి

సిఐటియు జిల్లా మహాసభల్లో తీర్మానం ▶ 8లో



తీరంలో పరిశీలిస్తున్న ఎస్పీ ఉమామహేశ్వర్

పర్యాటకుల భద్రత కోసం
పటిష్ట బందోబస్తు

▶ 8లో

రైతులకు న్యాయం జరిగేనా.?

(మొదటిపేజీ తరువాయి)

పంటలను పరిశీలించేందుకు కేంద్ర బృందం సోమవారం ప్రకాశం జిల్లాకు రానుంది. కేంద్ర బృందంలో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి పౌసుమి బసు, కేంద్ర ఆర్థిక శాఖ వ్యయ విభాగ ఉప సంచాలకులు మహేష్ కుమార్, విజయవాడ రోడ్డు రవాణా, జాతీయ రహదారులు శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శశాంక్ శేఖర్ రాయ్, హైదరాబాద్ ఇస్రో నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ సైంటిస్ట్ సాయి భగీరథ్ కేంద్ర బృంద సభ్యులుగా ఉన్నారు. కేంద్ర బృందం సోమవారం ఉదయం 11.15 గంటలకు సచివాలయం నుంచి బయలుదేరి మధ్యాహ్నం 1.45 గంటలకు ఒంగోలు చేరుకొని అతిథి గృహంలో బస చేస్తారు. మధ్యాహ్నం 2.30 నుంచి 3.15 గంటల వరకు జిల్లా అధికారులను కలుసుకొని ప్రకాశం భవనంలో ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను తిలకిస్తారు. మధ్యాహ్నం 3.15 గంటలకు ఒంగోలు నుంచి రోడ్డు మార్గంలో కొత్తపట్నం మండలం అల్లూరు గ్రామానికి కేంద్ర బృందం చేరుకుంటుంది. సాయంత్రం 4 గంటల వరకు అల్లూరు గ్రామంలో దెబ్బతిన్న పంటలు, ధ్వంసమైన రహదారులు, భవనాల శాఖ కల్వర్టు, నీట మునిగిన చేపల చెరువులను పరిశీలిస్తారు. సాయంత్రం 4 గంటలకు అల్లూరు నుంచి రోడ్డు మార్గంలో నాగులుప్పలపాడు మండలం ఒమ్మెవరం బయలుదేరతారు. సాయంత్రం 4.45 గంటలకు ఒమ్మెవరం చేరుకొని మొంథా తుపాన్ కారణంగా దెబ్బతిన్న పంటలను పరిశీలించి, రైతులతో కేంద్ర బృందం సభ్యులు కలుసుకొని మాట్లాడతారు. సాయంత్రం 5.15 గంటలకు ఒమ్మెవరం నుంచి కేంద్ర బృంద సభ్యులు బాపట్ల జిల్లా చీరాలకు బయలుదేరతారు.

ప్రభుత్వ ఆస్తుల్ని 'ప్రైవేటు'కు కట్టబెట్టేందుకే..

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ మెడికల్ మాఫియాను ప్రోత్సహిస్తూ రాష్ట్రంలో 500 ఎకరాల్లో నిర్మాణంలో ఉన్న 10 ప్రభుత్వ మెడికల్ కళాశాలలు, ప్రభుత్వ ఆసుపత్రులను కార్పొరేట్ మెడికల్ మాఫియాకు కట్టబెట్టాలనే కుట్ర చేస్తోందని, అందుకే పిపిపి విధానం తెచ్చిందని పేర్కొన్నారు. సదస్సుకు అధ్యక్షత వహించిన ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఆలా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడానికి వ్యతిరేకంగా చేపట్టే రాష్ట్రవ్యాప్త ఉద్యమంలో భాగస్వాములు కావాలన్నారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ కార్పొరేట్ వైద్య సంస్థలకు ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కట్టబెట్టడం దారుణమన్నారు. దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకులు కొరివి వినయ్ కుమార్ మాట్లాడారు. గత 17 నెలలుగా బాపట్ల ప్రభుత్వ మెడికల్ కళాశాలలో అదనంగా ఎలాంటి నిర్మాణం జరగలేదని, ఇక్కడి నుంచి కొంత ఇనుమును పిడుగురాళ్ల మెడికల్ కళాశాలకు తరలించినట్లు గుర్తించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంట అంజిబాబు, సిపిఐ కార్యవర్గ సభ్యులు పరుచూరి రాజేంద్రబాబు, సిపిఐ బాపట్ల జిల్లా కార్యదర్శి సింగరకొండ, ప్రభుత్వ మెడికల్ కళాశాలల కో కన్వీనర్ కె. వసుంధర, విసికె పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్‌జె విద్యాసాగర్, సమాజ్‌వాది పార్టీ జిల్లా అధ్యక్షులు మేధ శ్రీనివాసరావు, వ్యవసాయ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ దర్శి విష్ణుశంకర్, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తవ్వ సురేష్ పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగాల కల్పనే ధ్యేయం

(మొదటిపేజీ తరువాయి)

సుమారు 76 పారిశ్రామిక పార్కులను వర్చువల్‌గా ప్రారంభిస్తారని తెలిపారు. ఎస్పీ హర్షవర్ధన్ రాజు మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా 750 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో కనిగిరి, ఒంగోలు ఆర్డీవోలు కేశవర్ధన్‌రెడ్డి, లక్ష్మీప్రసన్న, డీఎస్పీ సాయి ఈశ్వర యశ్వంత్, కనిగిరి సీఐ ఖాజావలి, తహశీల్దార్ సిహెచ్.ఉష, ఎస్సై జి కోటయ్య, వీఆర్వో రఫీ అహ్మద్, డిసిఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి, యారవశ్రీనివాసులు, టిడిపి మండల అధ్యక్షులు వేమూరి రామయ్య, పువ్వాడ నాగరాజు, సర్పంచ్ గడ్డం సుబ్బ రాయుడు, జనసేన నాయకులు మాదాసు రమేష్ బాబు, ఐదు మండలాల పార్టీ అధ్యక్షులు బొల్లా నరసింహారావు, సాని కొమ్ము తిరపతిరెడ్డి, బొబ్బూరి రమేష్, కేలం ఇంద్రభూపాల్ రెడ్డి, ఫిరోజ్, పువ్వాడి నాగరాజు, గాయం తిరుపతిరెడ్డి, ముత్తుముల వెంకటరెడ్డి, పులి ప్రతాప్, ఎబినేజర్ ల్గొన్నారు.

కొనసాగుతున్న కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి-మార్కాపురం

కోటి సంతకాల సేకరణలో మాజీ ఎమ్మెల్యే అన్నా

ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి చేపట్టిన కోటి సంతకాల సేకరణ కొనసాగుతోంది. మార్కాపురం మున్సిపాలిటీలోని 18, 31వ వార్డుల్లో ఈ కార్యక్రమం ఆదివారం జరిగింది. వైసిపి పట్టణ అధ్యక్షుడు, మున్సిపల్ 20వ వార్డు కౌన్సిలర్ షేక్ సలీమ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిధిగా వైసిపి ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు పాల్గొన్నారు. ఆ తరువాత మార్కాపురం మండంలోని నికరంపల్లి, కె కొత్తపల్లి, జమ్మనపల్లి గ్రామాల్లోనూ కోటి సంతకాల సేకరణ కొనసాగింది. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర నాయకులు వెన్నా హనుమారెడ్డి, మార్కాపురం మండల వైసిపి అధ్యక్షుడు పోరెడ్డి చెంచిరెడ్డి, ఎంపిపి బండి లక్ష్మీదేవి క్రిష్ణారెడ్డి, జడ్‌పిటి నారు బాపన్‌రెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

డైరెక్టర్‌గా శ్రీను ప్రమాణ స్వీకారం

ప్రమాణ స్వీకారం చేసిన నక్కా శ్రీను

ప్రజాశక్తి-పెద్దారవీడు: రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నక్క శ్రీనివాసులు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ మేరకు విజయవాడలో జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు.

వన విహారి ప్రారంభం

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

వనవిహారిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

అడవుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని గిద్దలూరు శాసన సభ్యులు ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. గిద్దలూరు మండలం, దిగువమెట్ట అటవీ ప్రాంతంలో ఆదివారం అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్తీక సమారాధన కార్యక్రమంలో పర్యాటకుల కోసం నూతనంగా ఏర్పాటు చేసిన వన విహారి వుడెన్ కాటేజ్‌లను ప్రారంభించారు. మొదటగా ఎమ్మెల్యే మొక్కలు నాటారు అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. అటవీ శాఖ అధికారులు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డిని శాలువ పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ అండ్ ఎఫ్‌డిపిటి బి విజయ్‌కుమార్, డిప్యూటీ డైరెక్టర్ నిషాకుమారి, అటవీశాఖ అధికారులు అనురాగ్, జి విగ్నేష్, టీడీపీ నాయకులు పాలుగుళ్ల ప్రతాప్‌రెడ్డి, దప్పిలి విజయ భాస్కర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు మార్తాల సుబ్బారెడ్డి, సయ్యద్ శానేశావలి, మార్కెట్ యార్డ్ చైర్మన్ బైలడుగు బాలయ్య, వైస్ చైర్మన్ గోడి ఓబుల్‌రెడ్డి, సహకార సంఘం చైర్మన్ దుత్తా బాల ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ మొహమ్మద్ అల్లమా ఇక్బాల్ జయంతి

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

అల్లమా ఇక్బాల్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

డాక్టర్ మహమ్మద్ అల్లమా ఇక్బాల్ ఉర్దూ భాషాభివృద్ధికి ఎంతో కృషి చేశారని, ఆయన జయంతి సందర్భంగా ప్రపంచ ఉర్దూ దినోత్సవం నిర్వహించడం సంతోషంగా ఉందని రూట జిల్లా గౌరవ అధ్యక్షులు షేక్ సమీవుల్లా బాషా అన్నారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ ఉర్దూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా అల్లమా ఇక్బాల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రూట జిల్లా గౌరవ అధ్యక్షులు సమీవుల్లా బాషా మాట్లాడుతూ అల్లమా ఇక్బాల్ జీవిత విశేషాల గురించి, ఆయన రాసిన పద్యాలు, కవితల గురించి విద్యార్థులకు వివరించారు. యూటీఎఫ్ అధ్యక్షులు ఓ వీరారెడ్డి మాట్లాడారు. అనంతరం ఉర్దూ నేషనల్ గాలిబ్ అవార్డు గ్రహీత సయ్యద్ ఫాతిమాబీ, ఇటీవల ఉర్దూ డాక్టరేట్ పొందిన డాక్టర్ రైజ్ ఫాతిమాలను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునగాల చంద్రశేఖర్‌రెడ్డి, రూట కార్యవర్గ సభ్యులు షేక్ అన్వర్‌బాషా, ఉర్దూ ఉపాధ్యాయులు షేక్ చాంద్‌బాషా, పఠాన్ ముర్తుజ, షేక్ బురాని పీరా, పఠాన్ అయుబ్ ఖాన్, సయ్యద్ అష్రాఫ్ అలీ, సయ్యద్ గఫార్, షేక్ రఫీ, జామియా మస్జిద్ ముతవల్లి ఎం సఫ్దర్ అలీ బేగ్, ఎం గుల్షన్ బేగ్, ఉర్దూ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షులు పఠాన్ అబ్దుల్ వహీద్ ఖాన్, దేవరాజుగట్టు ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ రసూల్, ముస్లిం మైనార్టీ నాయకులు మీర్జా బర్కత్ అలీ బేగ్, ఉర్దూ భాషాభిమానులు, ఉర్దూ విద్యార్థులు పాల్గొన్నారు.

నలుగురు వ్యక్తులపై కేసు నమోదు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

లాడ్జి యజమానిపై దాడి చేసిన సంఘటనలో నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి చౌడయ్య తెలిపారు. ఆదివారం ఎస్ఐ చౌడయ్య తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ఉన్న దుర్గ లాడ్జిలో ఈ నెల 7వ తేదీన మురారిపల్లి గ్రామానికి చెందిన మల్లికార్జునరెడ్డికి సంబంధించిన వారి వివాహం కోసం లాడ్జిలో రూములు అద్దెకు తీసుకున్నారు. రూములకు తాళాలు వేసుకొని వెళ్లారు. అయితే 8వ తేదీన అర్ధరాత్రి సమయంలో సుబ్బారెడ్డి, శ్రీనివాసరెడ్డి, పల్నాడు జిల్లాకు చెందిన మరో ఇద్దరు వ్యక్తులు లాడ్జిలోకి అక్రమంగా ప్రవేశించి లాడ్జిలో పనిచేసే హనుమంతునాయక్ అనే వ్యక్తిని తాళాలు ఇవ్వాలని అడిగారు. తాళాలు తమ వద్ద లేవని, మీ వాళ్ల దగ్గరే ఉన్నాయని చెబుతున్నా వినకుండా పెద్దగా కేకలు వేస్తూ గొడవకు దిగారు. అదే సమయంలో అక్కడే ఉన్న లాడ్జి యజమాని గ్రంధిశిల వెంకట చిన్న సుబ్బారావు కేకలు విని అక్కడికి వచ్చారు. విషయం ఏంటి అని అడుగుతున్నా కానీ లాడ్జి యజమాని మాట కూడా వినకుండా నోటికి వచ్చినట్టుగా బూతులకు దిగారని, మల్లారెడ్డి అనే వ్యక్తి లాడ్జి యజమానిపై దాడిచేసి నీ అంతు చూస్తా అంటూ బెదిరింపులకు పాల్పడుతూ భయభ్రాంతులకు గురి చేశారని, ఈ నలుగురి వల్ల తనకు ప్రాణహాని ఉందంటూ లాడ్జి యజమాని గ్రంధిశిల వెంకట చిన్న సుబ్బారావు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ పి చౌడయ్య తెలిపారు.

వేరువేరు చోట్ల ఆత్మహత్యకు యత్నించిన

ఇద్దరు యువకులు మృతి

ప్రజాశక్తి-మార్కాపురం

వేరువేరు సంఘటనలో ఇటీవల మార్కాపురం పట్టణంలో పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఇద్దరు యువకులు శనివారం రాత్రి మృతి చెందారు. దొనకొండ మండలం మల్లంపేట గ్రామానికి చెందిన మేత్తుల శ్రీనివాసరావు(20) ఈ నెల నాలుగో తేదీన స్థానిక కాలేజీ రోడ్డులో పురుగు మందు తాగాడు. విషయాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో గుంటూరు వైద్యశాలకు తరలించారు. తర్లుపాడు మండలం గానుగపెంట గ్రామానికి చెందిన మాధురి శివకుమార్(20) ఈ నెల ఆరో తేదీన మార్కాపురంలోని ఓ లాడ్జిలో పురుగుమందు తాగాడు. గమనించిన లాడ్జి నిర్వాహకులు పోలీసులకు సమాచారం అందించారు. గుంటూరు వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. వీరి ఆత్మహత్యలకు కుటుంబ కలహాలేనని కారణమని తెలిసింది. మార్కాపురం పట్టణ ఎస్ఐ ఎం సైదుబాబు కేసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయుడు నగేష్ బాబుకు ఘన నివాళి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్: ప్రైవేట్ పాఠశాలలో బోధించే హిందీ ఉప్యాయుడు నగేష్ బాబుకు పలువురు ఘన నివాళి అర్పించారు. ఒంగోలు మాంటిస్సోరి హైస్కూలు ఆవరణలో నగేష్‌బాబు సంస్మరణ సభ ప్రైవేట్ టీచర్స్, ప్రొఫెసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వై సాంబశివరావు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వక్తలు బోధనా రంగంలో నగేష్‌బాబు నిబద్ధత, ప్రైవేట్ ఉపాధ్యాయుల పోరాటాలలో ఆయన చేసిన కృషిని కొనియాడారు. నగేష్‌బాబు కృషిని ముందుకు తీసుకెళ్లటమే ఆయనకు ఇచ్చే నివాళి అని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. నగేష్ బాబు కుటుంబానికి ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ ప్రొఫెసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పిటిపిఎల్‌డబ్లుఏ జిల్లా అధ్యక్షులు సాంబశివరావు, కార్యదర్శి కిరణ్, కమిటీ సభ్యులు షేక్ నూరుద్దీన్, రోహిత్, రమణ, మారుతి, ప్రైవేట్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-రాచర్ల

రాచర్ల మండలం అన్నంపల్లె గ్రామం పురాతన చెరువు గత నెలలో సంభవించిన మొంథా తుపానుకు నిండి అలుగుపారింది. దాదాపు 7 సంవత్సరాల తరువాత చెరువు నిండి అలుగు పారిన సందర్భంగా ఆదివారం ఆయకట్టు ప్రెసిడెంట్ సిరిగిరి శ్రీహరి దంపతులు చెరువు వద్ద గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి యువనేత ముత్తుముల క్రిష్ణ కిషోర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గంగమ్మకు పసుపు కుంకుమలు, నూతన వస్త్రం, నైవేద్యం సమర్పించి చెరువు గంగలో కలిపారు. ఈ సందర్భంగా కృష్ణ కిషోర్‌రెడ్డి ఆయకట్టుదారు రైతులతో సాగు చేస్తున్న పంటలు, వారి యోగ క్షేమాల పట్ల పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు క్రిష్ణ కిశోర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ కుప్పా రంగసాయిలను శాలువా పులమాలతో ఘనంగా సన్మానించారు.

IN THE COURT OF THE HON'BLE PRL. SENIOR CIVIL JUDGE AT SANGAREDDY
I.A. NO. 1497 OF 2024
IN
O.S.NO. 268 OF 2022

Between:
Tummareddygari Latha @ Hanumannolla Latha @ Aruna
...Petitioner / Plaintiff
AND
Hanmannolla Hemalatha & others.
...Respondents / Defendants

To,
7. Bogineni Chinna Ramaiah S/o. Narayana, Aged about 52 years, Occ: Business, R/o. H.No.133-3, Puretipalle (V), Gudur Mandal, Prakasham Dist., **...(R7)**

NOTICE

Whereas the Petitioner/plaintiffs filed the above Suit for partition and separate possession in respect of suit schedule property against Respondent /Defendants. The case is posted on 20/11/2025 for appearance of Respondent No. 7, if any persons are having claim or objections they can appear before the said court on the said date at 10.30 a.m. if fails to appear on the said date and time before the said court the case will be decided as per law.

// BY ORDER OF THE COURT //

K. KRISHNA RAO,
Advocate,
Sangareddy.
Cell: 9849138580

ముందు వెళ్తున్న లారీని ఢీకొన్న మరో లారీ

క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను కాపాడిన జర్నలిస్టులు, పోలీసులు

అక్కాయిపాలెం టపాసుల గూడెం వద్ద ఘటన

క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను తీస్తున్న దృశ్యం

ప్రమాదంలో నుజ్జు అయిన లారీ క్యాబిన్

ప్రజాశక్తి-చీరాల

విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులు, పోలీసులు మానవత్వం చాటి ఒక నిండు ప్రాణాన్ని కాపాడారు. జాతీయ రహదారిలో ఒకే మార్గంలో ప్రయాణిస్తున్న రెండు లారీలు ప్రమాదవశాత్తు ఒకదానిని ఒకటి ఢీకొని డ్రైవర్ క్యాబిన్లో ఇరుక్కుపోవడంతో రెండు గంటల పాటు శ్రమించి జేసిబి, గ్యాస్ కట్టర్ సహాయంతో సురక్షితంగా డ్రైవర్‌ను బయటకు తీసి వైద్యశాలకు తరలించారు. ఈ ఘటన శనివారం అర్ధరాత్రి చీరాల, ఒంగోలు జాతీయ రహదారిలోని అక్కయ్యపాలెం జంక్షన్ సమీపంలో టపాసుల గూడెం వద్ద జరిగింది. వివరాల్లోకి వెళితే.. చీరాల నుండి ఒంగోలు వైపుకు జాతీయ రహదారిలో ఓ లారీ ప్రయాణిస్తోంది. అదే సమయంలో కంకటపాలెం నుంచి ఒంగోలు వైపుకు ధాన్యం బస్తాల లోడుతో మరో హైచర్ లారీ వెళ్ళుతోంది. అక్కయ్యపాలెం జంక్షన్ సమీపంలో టపాసులు గూడెం వద్దకు రాగానే ముందు వైపు ప్రయాణిస్తున్న లారీ డ్రైవర్ ఒక్కసారిగా బ్రేకులు వేయడంతో లారీ ఆ వేగంకు క్యాబిన్ రోడ్డు పైకి వచ్చింది. అయితే వెనుక వైపు నుండి అదే మార్గంలో ధాన్యం లోడుతో ప్రయాణిస్తున్న లారీ ముందు ఉన్న లారీను ఢీ కొట్టింది. ఇది అంతా రెప్పపాటులో జరిగిపోయింది. అయితే ఈ ప్రమాదంలో ధాన్యం లోడు లారీ నడుపుతున్న డ్రైవర్ మురళి క్యాబిన్‌లో ఇరుక్కుపోయి కొట్టుమిట్టాడుతున్నాడు. సమాచారం అందుకున్న జర్నలిస్టులు, పోలీసులు ప్రమాద ఘటనకు చేరుకున్నారు. క్యాబిన్లో పూర్తిగా ఇరుక్కుపోయిన డ్రైవర్ మురళిని కాపాడేందుకు జర్నలిస్ట్ దిలీప్, వేటపాలెం ఎస్సై జనార్దన్ క్యాబిన్‌లో ఉన్న ఇనుప రాడ్లు తొలగించే ప్రయత్నం చేశారు. డ్రైవర్ ఆర్తనాదాలు పెట్టడంతో అతనికి జర్నలిస్టులు, పలువురు తాగునీరు అందిస్తూ సపర్యలు చేస్తూ ధైర్యం చెప్పారు. ఎంతకీ అవి రాకపోవడంతో గ్యాస్ కట్టర్, జెసిబి సహాయంతో రెండు గంటల పాటు శ్రమించి డ్రైవర్ మురళిని కాపాడారు. అనంతరం ఆయనను చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మానవత్వం చాటి క్యాబిన్లో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను సురక్షితంగా కాపాడిన జర్నలిస్టు దిలీప్‌ను వేటపాలెం ఎస్సై జనార్ధన్‌ను పలువురు అభినందించారు. ఈ ప్రమాదానికి ముందు వెళు_న్న లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనం నడపడమే కారణమని అటుగా పయనిస్తున్న వాహనదారులు పోలీసులకు తెలపటంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

సహాయనిధి చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి స్వామి

సహాయ నిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-టంగుటూరు

రాష్ట్ర ప్రజలు ఆరోగ్యంగా ఉండాలన్న ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేయడం జరుగుతుందని మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. టంగుటూరు మండలంలోని తూర్పునాయుడపాలెంలో తన క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. టంగుటూరు మండలం, యం.నిడమలూరుకు చెందిన బెజవాడ కృష్ణమూర్తికి అనారోగ్యం కారణంగా కొంత మొత్తం ఖర్చు కాగా సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.45 వేల రూపాయలు చెక్కును మంత్రి స్వామి అందచేశారు. ఈ కార్యక్రమంలో టంగుటూరు మండల ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి పిడుగురాళ్ల సురేష్ బాబు, బెజవాడ రాజేష్ పాల్గొన్నారు.

ఆలయ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-కొండపి

కొండపి మండలంలోని ముప్పవరం గ్రామం రామలింగేశ్వర స్వామి ఆలయ కమిటీ నూతన చైర్మన్‌గా నేలపట్ల నరసింహమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఈవో సాంబశివరావు తెలిపారు. ఆదివారం ఆలయంలో ఈవో ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్, కమిటీ సభ్యుల చేత ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. నూతన కమిటీ వైస్ చైర్మన్‌గా పిడుగురి రామ్మూర్తి, సభ్యులుగా రావులపల్లి ప్రసాద్, నన్నూరి వెంకయ్య, ఉప్పుటూరి వెంకాయమ్మ, కాకుమాని పద్మ, మట్టిపాటి ఈశ్వరమ్మ, నిడమనూరు అనూష, బద్దిపూడి సదాశివశర్మ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులకు గ్రామస్తులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు బత్తుల నారాయణస్వామి, ప్రజలు పాల్గొన్నారు.

గృహప్రవేశ వేడుకల్లో వెంకయ్య

ప్రజాశక్తి-జరుగుమల్లి : జరుగుమల్లి మండలం ఎడ్లూరుపాడు గ్రామంలో సర్పంచి రావి శ్రీనివాసులు తమ్ముడు రావి వెంకట్రావు గహప్రవేశ కార్యక్రమంలో వైసీపి పార్టీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు కొండేపి నియోజక వర్గం మాజీ సమయకర్త, పీడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య పాల్గొన్నారు. రావి వెంకట్రావు దంపతులకు డాక్టర్ వెంకయ్య శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపి నాయకులు రావిమాధవరావు, రావి మాలకొండయ్య, రావి లింగయ్యనాయుడు పలువురు స్థానిక వైసీపి నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటి సమాచారం సేకరణ

ప్రజాశక్తి-కనిగిరి : కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి ఆదేశాల మేరకు కనిగిరి పట్టణంలోని ఇందిరా కాలనీ ఒకటవ వార్డులో ఆదివారం ఓటర్ సమాచార సేకరణ కార్యక్రమంను టిడిపి నాయకులు నిర్వహించారు. వార్డు అధ్యక్షుడు ఓబుల్ శెట్టి ముకుంద ధనలక్ష్మి, యూనిట్ కో ఇంచార్జ్ వి.నాగదుర్గ, బూత్ ఇంచార్జ్ వి.బాలకృష్ణ, బూత్ కో కన్వీనర్ షేక్ ఫాతిమా, కెఎస్ఎస్ సభ్యులు షేక్ జానీ భాష, వి.స్వప్నలు ఓటర్ సమాచారాన్ని ఇంటిటికీ తిరిగి సేకరించారు.

హ్యూమన్ రైట్స్ ప్రకాశం జిల్లా సమన్వయకర్తగా

రావినూతల జయకుమార్

ప్రజాశక్తి-శింగరాయకొండ

జయకుమార్

శింగరాయకొండ సుందర్‌నగర్ కాలనీకి చెందిన రావినూతల జయకుమార్‌ను హ్యూమన్ రైట్స్ జిల్లా సమన్వయకర్తగా నియమించినట్లుగా హ్యూమన్ రైట్స్ రాష్ట్రశాఖ అధ్యక్షులు శ్రీనివాసరావు తెలిపారు. జయకుమార్ సాంత్వనా సేవసమితి స్వచ్ఛంద సేవ సంస్థ అధ్యక్షులుగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సేవా రత్నపురస్కారాన్ని అందుకున్నారు. అంతేకాకుండా అనేక స్వచ్ఛంద సేవ సంఘాలతో వివిధ హెూదాల్లో పనిచేసి సమాజానికి తన వంతు సేవలను అందిస్తున్నారు. జయ కుమార్ సమాజానికి అందిస్తున్న సేవలను ఆయనలో ఉన్న సేవాతత్పరత, అంకితభావం, సమాజం పట్ల గౌరవం, ముఖ్యంగా బాల్య వివాహాలు, బాల కార్మికులు, బాండెడ్ చైల్డ్ లేబర్, వీధి బాలలు, అరికట్టడంలో విస్తతంగా తను చేసిన సేవలను గుర్తించి హ్యూమన్ రైట్స్ రాష్ట్రశాఖ అధ్యక్షులు శ్రీనివాసరావు, జయకుమార్‌ని జిల్లా సమన్వయకర్తగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. హ్యూమన్ రైట్స్ అభివృద్ధికి పేద, నిరుపేదల హక్కుల సాధనకు వారి అభ్యున్నతికి జయకుమార్ కృషి చేస్తారని ఆయన పేర్కొన్నారు. కాగా తనను జిల్లా సమన్వయకర్తగా నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసరావుకి, జిల్లా అధ్యక్షులు కోడూరు వెంకటేశ్వరరావుకి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు జయకుమార్‌కి అభినందనలు తెలిపారు.

కోవిలంపాడులో నీటి కష్టాలు

ప్రజాశక్తి- సీఎస్‌పురం రూరల్

నిరుపయోగంగా ఉన్న ట్యాంక్

అంగట్లో అన్ని ఉన్నా అల్లుడు నోట్లో శని అన్నట్లు ఉంది మండలంలోని కోవిలంపాడు గ్రామ ప్రజల పరిస్థితి. గ్రామంలోని త్రాగునీటి పథకాలలో పుష్కలంగా నీరు ఉన్నా అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆ నీటిని వాడుకోలేని పరిస్థితిలో నీటి కోసం ఇక్కట్లు పడుతున్నట్లు గ్రామస్థులు తెలియజేస్తున్నారు. గ్రామంలోని చెరువు కట్ట సమీపంలో ఉన్న డీప్ బోర్ నుంచి సచివాలయం పక్కనే ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్‌కి నీటిని ఎక్కించి ఆ ట్యాంక్ నుంచి గ్రామంలోకి నీటిని సరఫరా చేస్తుంటారు. అయితే ట్యాంక్‌లోనుంచి గ్రామంలోనికి నీటిని సరఫరా చేసే పైపు లీకేజీ ఏర్పడడంతో గ్రామంలోనికి నీరు సరఫరా కావడం లేదు. నాలుగు రోజులుగా నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు గానీ, పంచాయతీ పాలకులు గానీ, పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఇంచార్జ్ పంచాయతీ కార్యదర్శి వినోద్‌ను ప్రజాశక్తి వివరణ కోరగా లీకేజీ ఏర్పడిన చోట పైపును మరమ్మతులు చేస్తున్నామని శనివారం నుంచి గ్రామంలోనికి నీటిని సరఫరా చేస్తామన్నారు.

పేదలకు వైద్య విద్యను దూరం చేసేందుకే ప్రైవేటీకరణ

ప్రజాశక్తి-కొండపి

పేదలకు వైద్య విద్యను వైద్యమును దూరం చేసేందుకే మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు కూటమి ప్రభుత్వం పూనుకుందని మండల కన్వీనర్ బచ్చల కోటేశ్వరరావు మండిపడ్డారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకుకు వ్యతిరేకంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన ప్రజా ఉద్యమం పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన ప్రజా ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై ప్రతి గ్రామంలో ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించే విధంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. బుధవారం తలపెట్టే ప్రజా ఉద్యమం కార్యక్రమానికి మండలంలోని రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయి, నియోజకవర్గస్థాయి, మండల స్థాయి, గ్రామస్థాయిలో పార్టీ పదవులు పొందిన ప్రతి ఒక్కరూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ముందుగా ప్రజా ఉద్యమం పోస్టర్‌ను స్థానిక నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు.

కొండపిలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైసీపీ నాయకులు

ఘనంగా చెవిరెడ్డి జన్మదిన వేడుకలు

స్థానిక పార్టీ కార్యాలయంలో ఒంగోలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇంచార్జ్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను మండల కన్వీనర్ బచ్చల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేకు కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు అనంతరం స్వీట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు షేక్ వన్నూరు, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు మారం రెడ్డి గంగాధర్ రెడ్డి, మండల బీసీ సెల్ అధ్యక్షుడు కొర్నేలు, మైనార్టీ సెల్ అధ్యక్షుడు సుల్తాన్, ప్రచార విభాగం అధ్యక్షుడు నజీర్, నాగుర్, దావీదు, తదితర వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

టంగుటూరు: 12వ తేదీ బుధవారం కొండేపి మండలంలో మాజీ మంత్రి, వైసీపీ పిఎసి సభ్యులు, కొండేపి నియోజకవర్గం ఇంచార్జ్ డాక్టర్ ఆదిమూలపు సురేష్ నాయకత్వంలో జరగబోయే మెడికల్ కాలేజ్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ ప్రజా ఉద్యమం ర్యాలీ పోస్టర్‌ని టంగుటూరు మండలం వైసీపీ అధ్యక్షులు చింతపల్లి హరిబాబు సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కొండేపి నియోజకవర్గం మాజీ ఎఎంసి డైరెక్టర్ కొమ్ము సురేంద్ర, మండల యూత్ అధ్యక్షులు దేవరపల్లి వరుణ్, వాణిజ్య విభాగ అధ్యక్షులు పేరూరు కమలాకర్, సీనియర్ నాయకులు బొడ్డు రవీంద్ర, పమిడి హరికష్ణ, (యల్‌జి) రాజు, శిఖ సుబ్బారావు, రావినూతల మనోహర్, కార్యకర్తలు దేశిరెడ్డి, పవన్, రసూల్, రాజశేఖర్, ఆకాష్, అశోక్, అభిమానులు పాల్గొన్నారు.

జరుగుమల్లి : ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం పోస్టర్‌ను జరుగుమల్లి వైసీపి అధ్యక్షులు పిన్నిక శ్రీనివాసరావు ఆదివారం జరుగుమల్లి మండలంలోని సాధువారిపాలెం గ్రామంలో ఆవిష్కరించారు. నవంబరు 12వ తేదీన జరిగే నిరసన ర్యాలీని జయప్రదం చేయాలని పిన్నిక శ్రీనివాసరావు కోరారు. ఈ సందర్భంగా చెవిరెడ్డి భాస్కరరెడ్డి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో జరుగుమల్లి మండల వైసీపి ఉపాధ్యక్షులు దగ్గుమాటి శ్రీనివాసరావు, బత్తిన మదన మనోహరరావు, కనపర్తి శేషారెడ్డి, చుండూరి శ్రీనివాసరావు, శ్రీకాంత్‌రెడ్డి, గడ్డం వీర నారాయణ, శ్రీను, శ్రీహరి, వెంకట్రావు, అనిల్ పాల్గొన్నారు.

టంగుటూరులో పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైసీపీ నాయకులు

జరుగుమల్లిలో సంతకాల సేకరణలో పిన్నిక శ్రీనివాసరావు

బాలికల వసతి గృహంలో పండ్లు పంచుతున్న దృశ్యం

విద్యార్థినులకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి - పంగులూరు

మంత్రి గొట్టిపాటి రవికుమార్ పుట్టినరోజు సందర్భంగా టిడిపి ఆధ్వర్యంలో బీసీ బాలికల వసతి గృహంలో పండ్లు పంపిణీ చేశారు. ముప్పవరంలోని బీసీ బాలికల వసతి గృహంలోని విద్యార్థులు అందరికీ పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షులు రావూరి రమేష్ బాబు, సీనియర్ నాయకులు కుక్కపల్లి ఏడుకొండలు మాట్లాడారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా గొట్టిపాటి రవికుమార్ పనిచేస్తున్నారని అన్నారు. అందువల్లనే ప్రజలు ఆయనను అభిమానిస్తున్నారని అన్నారు. నియోజవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని చెప్పారు. ఆయన పుట్టినరోజును వేడుకగా జరుపుతున్నామని తెలిపారు. అనంతరం విద్యార్థినిలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా డైరీ మాజీ చైర్మన్ బాలిన రామసుబ్బారావు, జాగర్లమూడి వారిపాలెం పిఎసిఎస్ అధ్యక్షులు అల్లంనేని బ్రహ్మానంద స్వామి, గుర్రం ఆదిశేకర్, వలపర్ల సుబ్బారావు, గుదిబండ్ల ఆదిరెడ్డి, గొట్టిపాటి కాజా స్వామి, దూళిపాళ్ల వీరనారాయణ, రేణింగవరం మాజీ సర్పంచ్ అమర్తపూడి ఏసోబు, ఎల్లాల నాగిరెడ్డి, కాటా అంజయ్య పాల్గొన్నారు.

విద్యార్థిని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

ఆర్థిక సహాయం అందజేత

ప్రజాశక్తి - కారంచేడు

అమెరికాలో రెండు రోజుల క్రితం అకాల మరణానికి గురైన యార్లగడ్డ రాజలక్ష్మి కుటుంబానికి రూ.50 ఆర్థిక సహాయం అందించారు. గ్రామానికి చెందిన వృద్ధ శరణాలయం నుంచి రాజ్యలక్ష్మి తండ్రి రామకృష్ణకు ఈ ఆర్థిక సహాయం ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో వృద్ధ శరణాలయం అధ్యక్షులు దగ్గుబాటి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు యార్లగడ్డ లక్ష్మీనారాయణ, కార్యదర్శి చాగంటి లక్ష్మీనారాయణ ఉన్నారు. ఉన్నత ఆశయంతో పై చదువులకు వెళ్లిన విద్యార్థిని అకాల మరణం ఎంతో బాధాకరమని, వారి కుటుంబానికి తీరని లోటని చెప్పారు.

ఎపిటిఎఫ్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

షేక్ జానీ బాషా

ఎపిటిఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ద్రోణాదుల పంచాయతీ సమితి ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయులు షేక్ జానీ బాషా అధ్యక్షులుగా, మార్టూరు అంబేద్కర్ నగర్ ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయులు మువ్వల సుబ్రహ్మణ్యం ప్రధాన కార్యదర్శిగా ఎంపికయ్యారు. ఎన్నికల అధికారిగా కంకణాల శ్రీనివాసరావు వ్యవహరించగా చెంచు రామారావు పర్యవేక్షించారు. నూతన కార్యవర్గాన్ని ఎపిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ మాడుగుల కిషోర్ అభినందించారు.

నిత్య అన్నదానంకు విరాళం

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలో కొలువైన శ్రీ సింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి అన్నదాన సత్రంలో నిత్య అన్నదానానికి ఎర్రిబోయిన బాబురావు, కుమితం వెంకట సుబ్బారెడ్డి ప్రతి ఏటా కోరుకున్న రోజున అన్నదానం జరిగేటట్లు రూ.20,232 విరాళం దేవస్థాన పాలక మండలి అధ్యక్షులు చుండూరి మురళి సుధాకరరావుకు అందజేశారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు సురేష్ బాబు పాల్గొన్నారు.

'గొట్టిపాటి' పుట్టినరోజు వేడుకలు

కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ జన్మదిన వేడుకలు టిడిపి శ్రేణులు ఘనంగా ఆదివారం నిర్వహించారు. మంత్రి ఆధ్వర్యంలో శంకర కంటి ఆసుపత్రి సహకారంతో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కంటి పరీక్షలు, బీపీ, షుగర్, రక్త పరీక్షలు ఉచితంగా చేశారు. వైద్యులు ఉచితంగా మందులు అందజేశారు. అవసరమైతే సర్జరీ మార్గదర్శకాలు చేశారు. మంత్రి చొరవతో ట్రై స్కూటీలు అందుకున్న దివ్యాంగులు పాల్గొన్నారు. దివ్యాంగులు కేక్ కటింగ్ చేసి మంత్రికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. దివ్యాంగుల సంక్షేమం, స్వావలంబన కోసం మంత్రి కృషిని ప్రశంసించారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ పుట్టినరోజు సందర్భంగా సింగరకొండ ట్రస్ట్ బోర్డు పాలక మండలి అధ్యక్షులు చూండూరి మురళి సుధాకరరావు ఆధ్వర్యంలో దేవస్థానంలో ఏర్పాటు చేసిన మంత్రి గొట్టిపాటి పుట్టినరోజు వేడుకల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఒప్పంద కార్మికులు, అర్చకులకు మిఠాయిలు పంచిపెట్టారు.

ఉత్తమ క్రీడాకారుల తయారీకి కృషి

బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

ప్రజాశక్తి - చీరాల

నియోజకవర్గం నుండి జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేయడానికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య తెలిపారు. స్థానిక ఎన్ఆర్ అండ్ పిఎం హైస్కూల్ గ్రౌండ్‌లో జరుగుతున్న 42వ రాష్ట్ర స్థాయి ఇంటర్ డిస్ట్రిక్ట్ టెన్నికాయిట్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈపాటికే పలు సార్లు జాతీయ స్థాయి పోటీలు నిర్వహించడం ద్వారా స్థానిక క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. అదే దిశగా ఈసారి జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో 19 జిల్లాల నుండి వచ్చిన 200 మంది బాల, బాలికలకు అవసర మైన వసతులు టిడిపి అధికార ప్రతినిధి మహేంద్ర నాథ్ ఆధ్వర్యంలో సమకూర్చినట్లు తెలిపారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, పోటీల ద్వారా అనుబ ్వం పెంపొందించుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలనే ఉద్దేశంతో ప్రతి క్రీడాకారుడు కృషి చేయాలని సూచించారు. విశ్వ విజేత శ్రీచరణిలా రాష్ట్రం గర్వించదగిన ఆణిముత్యాలుగా ఎదగాలని క్రీడాకారులను కోరారు. ఈ సందర్భంగా క్రీడల అభివృద్ధికి కృషి చేస్తున్న అసోసియేషన్ సెక్రటరీ సత్యనారాయణ, కోశాధికారి రమేష్, జిల్లా చైర్మన్ దేవరాజు, ఉపాధ్యక్షులు అలేఖ్య, కోశాధికారి కొల్లయ్యను అభినందించారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ కౌతవరపు జనార్ధన రావు, నాయకులు తేలప్రోలు నాగేశ్వరరావు, పిక్కి నారాయణ, అనపర్తి వనజ, రత్నబాబుతో పాటు పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

కంటి వైద్య శిబిరంలో డాక్టర్ మంచాల రమేష్

ప్రజాశక్తి - ఇంకొల్లు

మండలంలోని గంగవరంలో మంచాల వెంకట రామయ్య, రంగమ్మ విద్యా వైజ్ఞానిక కళ్యాణ మండపంలో ఉచిత బిపి, షుగర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం రెండు నెలలకు సరిపడా మందులు ఉచితంగా అందించారు. గత కొన్నేళ్లుగా ప్రతి రెండు నెలలకు ఒకసారి క్రమం తప్పకుండా వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మంచాల రమేష్ మాట్లాడుతూ షుగర్ వ్యాధి గ్రస్తులు ప్రస్తుత పరిస్థితుల్లో ఎక్కువ అవుతున్నారని అన్నారు. ప్రస్తుత జీవనా విధానంలో తీసుకునే ఆహారపు అలవాట్లతో పాటు శారీరక శ్రమ తగ్గిపోవడం కూడా షుగర్ పెరగటానికి కారణమని అన్నారు. షుగర్ వ్యాధి బాధితులు వ్యాధి తీవ్రతకు అనుగుణంగా ప్రతి రోజు మందు బిళ్ళలు మింగటం తప్పనిసరని అన్నారు. పేద, సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు శ్రమ చేసుకొని జీవించే వారికి నిత్యం వైద్యం ఖర్చు భారం అవుతుందని అన్నారు. అందులో భాగంగా గత కొన్నేళ్లుగా వారికి ఆర్థిక చేయూత అందించడంతో పాటు ఆరోగ్య జీవనం కల్పించేందుకు షుగర్ క్యాంపు ప్రతి రెండు నెలలకు ఒకసారి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు గ్రామంలోని పలువురు ఆర్థికంగా చేయూతనివ్వటం గొప్ప విషయం అన్నారు. డాక్టర్ ఎ సాంబయ్య మాట్లాడుతూ పేద, సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు వైద్య సేవలు చేయటం తమకు ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. రమేష్ ప్రోత్సలంతో గత కొన్నేళ్లుగా తను కూడా పాలుపంచుకున్నట్లు తెలిపారు. ఈ విడత మందులకు ఆర్థికచేయు తగా డాక్టర్ బోడింపూడి ప్రకాశరావు దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు బోడంపుడి కమలాకర రావు దంపతులు అందించారని తెలిపారు. ముందుగా ప్రకాశరావు దంపతులు, మంచాల వెంకటరామయ్య, రంగమ్మ, తాటి శాంతమ్మ చిత్రపటాలకు పూలు చలి నివాళులర్పించారు. వైద్య శిభిరం నిర్వహణలో సహకరించిన వాలటరీ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె రామకోటేశ్వ రరావు, సిఐటియు నాయకులు నాగండ్ల వెంకట్రావు, ఎర్రం గోవిందరెడ్డి, గాబ్రియేల్, సాంబిరెడ్డి, కరి రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.

పర్యవేక్షిస్తున్న కందిమళ్ల రామకోటేశ్వరరావు

ఇంకొల్లులో పర్యటించిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

అర్జీలు త్వరితగతిన పరిష్కరించండి

ప్రజాశక్తి - ఇంకొల్లు

ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీని త్వరితగతిన పరిశీలించి పరిష్కరించాలని, ఏ సమస్యనూ పెండింగ్‌లో ఉంచకూడదని అధికారులకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశించారు. ఇంకొల్లు, మార్టూరు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. మండల స్థాయి అధికారుల పరిధిలో లేని సమస్యల పరిష్కారానికి తక్షణమే ఉన్నత అధికారులకు పంపి చర్యలు తీసుకొనేలా చూడాలని సూచించారు. గ్రామాల్లో ప్రజల నుంచి వచ్చిన సమస్యలు, అభ్యర్థనలను స్వయంగా స్వీకరించారు. స్థానికుల సమస్యలు విని వెంటనే సంబంధిత అధికారులను ఫోన్ ద్వారా సంప్రదించి అవసరమైన సూచనలు ఇచ్చారు. గ్రామాల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తామని వెల్లడించారు. ప్రతి గ్రామంలో సిసి రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తామని అన్నారు. ప్రజలకు చేరువగా ఉండి సమస్యలు తీర్చడం తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. గ్రామాల్లో రోడ్లు, సైడ్ డ్రెయిన్లు, విద్యుత్, సంక్షేమ పథకాల లబ్ధిదారుల సమస్యలు పరిశీలించి తక్షణ పరిష్కారం కోసం బాధ్యులకు దిశానిర్దేశం చేశారు. ఎక్కువ సమయం తీసుకునే అర్జీలను ట్రాక్ చేసి పరిష్కారం వచ్చే వరకు ప్రజలకు సమాచారం అందించాలని కోరారు. పర్యటనలో ఎఎంసి చైర్మన్ గుంజి వెంకటరావు, పారిశ్రామికవేత్త విక్రం నారాయణరావు, ఇంకొల్లు అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు, గంగవరం, ఇంకొల్లు పిఎసిఎస్ అధ్యక్షులు బోడెంపూడి సుబ్బారావు, కర్రి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్వామి విజయేంద్రసరస్వతితో ఎంఎల్ఎ ఏలూరి

విజయేంద్ర సరస్వతిని కలిసిన ఏలూరి

ప్రజాశక్తి - ఇంకొల్లు

పెదకాకానిలోని శంకర్ కంటి ఆసుపత్రిలో శనివారం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుతో కంచి కామకోటి పీఠ జగద్గురువు శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి కొద్దిసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా స్వామీజీ ఎమ్మెల్యే ఏలూరిని ఆశీర్వదించారు. శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఏలూరి చారిటబుల్ ట్రస్ట్, నోవా అగ్రి గ్రూప్, గ్రీన్ స్పార్క్ ఫౌండేషన్ సహకారంతో నెల నెలా నిర్వహిస్తున్న కంటి వైద్య శిబిరాల కార్యక్రమాన్ని స్వామీజీకి వివరించారు. ఇప్పటి వరకు వేల మంది లబ్ధిపొందారని తెలిపారు. లక్షమందికి కంటిచూపు అందించడం ట్రస్ట్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. స్వామీజీ సేవా కార్యక్రమాలపై సంతోషం వ్యక్తం చేశారు. ఇలాంటి సేవలు మరింత విస్తరించాలని ఆశీర్వదించారు. కంటి ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెంచే దిశగా ట్రస్ట్ తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని అన్నారు.

రాజాం కమిషనర్‌గా రామచంద్రరావు

ప్రజాశక్తి - రేపల్లె

ఎ రామచంద్రరావు

మునిసిపల్ శానిటరి ఇన్స్‌పెక్టర్‌గా పనిచేస్తున్న ఆకురాతి రామచంద్రరావు రాజాం మునిసిపల్ కమీషనర్‌గా నియమించబడ్డారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులు సిడిఎంఎ అధికారులు జారీ చేశారు. మంత్రి అనగాని సత్యప్రసాద్ సూచనలతో పట్టణంలో చెత్త పాయింట్స్ క్లియర్ చేసి ఆ ప్రదేశాల్లో మొక్కలు నాటటం, శానిటేషన్ మెరుగుదలలో చురుకుగా పాల్గొంటూ ఉద్యోగులను విహారయాత్రలకు తీసుకెళ్ళటంలో తనదైన ముద్ర వేశారు. శానిటరి ఇన్స్‌పెక్టర్ల అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేస్తున్నారు. కమీషనర్‌గా పదోన్నతి పొందిన ఆయనను పలువురు అభినందించారు.

బొమ్మరిల్లులో చెవిరెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

వైసిపి ఒంగోలు పార్లమెంట్ ఇంచార్జ్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి 52వ జన్మదిన వేడుకలు ఆదివారం నాడు రాష్ట్ర పంచా యతీరాజ్ విభాగం జనరల్ సెక్రటరీ ముల్లంగి రవీం ద్రారెడ్డి, జిల్లా పంచాయతీరాజ్ అధ్యక్షులు నన్నే బోయిన రవికుమార్ ఆధ్వర్యంలో, ఒంగోలు హౌసింగ్ బోర్డ్ కాలనీలోని బొమ్మరిల్లు వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు పిల్లలతో కలిసి కేక్ కట్ చేసి, భోజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు, నగర అధ్యక్షులు కటారి శంకర్, రాష్ట్ర పార్లమెంట్ పరిశీలకులు వై.వెంకటేశ్వరరావు, బొట్ల రామారావు, కె.వి. రమణారెడ్డి, పార్టీ సంయుక్త కార్యదర్శి పాలడుగు రాజీవ్, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షులు నరికంటి శ్రీనివాస్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.అలాగే వల్లాటి రవీంద్రారెడ్డి, భూమిరెడ్డి రవణమ్మ, పేరం ప్రసన్న, గొల్ల నాగమణి, దేవా పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న వైసిపి నాయకులు

గొట్టిపాటి లక్ష్మిని కలిసిన 'ఇడమకంటి'

ప్రజాశక్తి-దర్శి : దర్శి టిడిపి ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మిని మరియు యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత సాగర్‌లను తాళ్లూరు వైస్ ఎంపిపి యిడమకంటి వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపిపి యిడమకంటి రమాదేవిలు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరు ఎంపిపి తాటికొండ శ్రీను, మండల పార్టీ అధ్యక్షులు మేడగం వెంకటేశ్వర్‌రెడ్డి, పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి మానం రమేష్, రాష్ట్ర డైరెక్టర్ నాటక అకాడమీ బొమ్మిరెడ్డి ఓబుల్‌రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ రాచకొండ వెంకట్రావు, మాజీ మండల బిసీ సెల్ పిన్నిక రమేష్, నవులూరి విద్యాసాగర్ పాల్గొన్నారు.

తాళ్లూరు ఎస్‌ఐపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్ : మాదిగలపై దౌర్జన్యం చేసి, కులం పేరుతో దూషించి అవమానించిన తాళ్లూరు ఎస్ఐ మల్లికార్జునపై ఎస్‌సి, ఎస్‌టి చట్టంలో కేసు నమోదు చేయాలని జిల్లా ఎస్‌పి వి.హర్షవర్ధన్ రాజును దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఒంగోలులోని తన కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఎస్ఐను విఆర్‌కు పంపి విచారణ చేయించాలన్నారు.

ప్రజా ఉద్యమం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-మద్దిపాడు

మండల కేంద్రమైన మద్దిపాడులోని సంతనూతలపాడు నియోజకవర్గ వైసిపి కార్యాలయంలో ఆదివారం వైసిపి ప్రజా ఉద్యమం పోస్టర్‌ను మాజీమంత్రి, నియోజకవర్గ సమన్వయకర్త మెరుగు నాగార్జున ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వై.యస్. జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 12వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాలలో తలపెట్టిన "మెడికల్ కాలేజీల ప్రవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి ప్రజా ఉద్యమం" నిరసన కార్యక్రమంలో భాగంగా ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలో ని వైసిపి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు అవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు, మద్దిపాడు ఎంపీపీ వాకా అరుణకోటిరెడ్డి, ప్రకాశం జిల్లా అధికార ప్రతినిధి బెజవాడ శ్రీరామ్ మూర్తి, సంతనూతలపాడు యువజన విభాగం అధ్యక్షులు పల్లపాటి అన్వేష్, ప్రకాశం జిల్లా యువజన విభాగం జనరల్ సెక్రటరీ కంకణాల సురేష్, ప్రకాశం జిల్లా ఆర్గనైజేషన్ జనరల్ సెక్రటరీ కుమ్మరి సుధాకర్, సంతనూతలపాడు నియోజకవర్గ పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షులు బొమ్మల రామాంజనేయులు, నాగులుప్పలపాడు మండల కార్యదర్శి పోలినేని వెంకట్రావు, మోహనరావు, అశోక్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

ఉచిత కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-పామూరు : పిఎల్‌రావు మోడరన్ ఐ హాస్పిటల్, నెల్లూరు ఆధ్వర్యంలో పామూరు పట్టణంలోని సత్యనారాయణ దేవాలయములో ఆదివారం పేదలకు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ భరత మాట్లాడుతూ 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించామని, ఆపరేషన్ అవసరమైన వారికి నెల్లూరులో ఆపరేషన్ చేయించి వారి ఇంటి చేరుస్తామన్నారు. వైద్య పరీక్షలు చేసిన డాక్టర్లు కె.తులసి, ఓ.రేవంతరెడ్డి, విష్ణు తేజ, పి.చిన్నయ్య, ఎం.సాయి రామ్ చరణ్, నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ డివి మనోహర్, పాతోలు రమేష్, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ భారతి

మాట్లాడుతున్న శ్యామల కాశిరెడ్డి

సీఎం సభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-వెలిగండ్ల

ఈనెల 11న పీసీపల్లి మండలం లింగన్నపాలెంలో జరిగే ముఖ్యమంత్రి సభను జయప్రదం చేయాలని డిసిఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి పేర్కొన్నారు. శనివారం వెలిగండ్ల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు కేలం ఇంద్ర భూపాల్ రెడ్డి అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా శ్యామల కాశిరెడ్డి మాట్లాడుతూ సీఎం పర్యటనకు మండ ల పరిధిలోని సీనియర్ నాయకులు, కుటుంబ సాధికార స భ్యులు, కార్యకర్తలు, అభిమానులు తప్పనిసరిగా 11వ తేదీ హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకట రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి వై.సలోమాన్ రాజు, నియోజకవర్గ తెలుగు రైతు అధ్య క్షులు అక్కి శ్రీనివాసులు రెడ్డి, మాజీ మండల తెలుగు యువత అధ్యక్షులు కర్నాటి భాస్కర్ రెడ్డి, మండల తెలుగు రైతు అధ్యక్షులు కీసరి రమణా రెడ్డి, మండల పార్టీ ఉపాధ్యక్షులు మోటాటి సుబ్బా రెడ్డి, నాయకులు ఆకుల రాజ్ కుమార్ నాయుడు, మండల ఐట డీపీ అధ్యక్షులు ఖాజా సైరుద్దీన్, సంపతి రాజ గోపాల్, పంత గాని నారాయణ, చిట్టి నరసింహ రావు పాల్గొన్నారు.

ఎంపికయిన విద్యార్థులతో వ్యాయామ ఉపాధ్యాయురాలు అరుణ

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-టంగుటూరు : టంగుటూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రణీత్, రిషితప్రియ, దీప్తి, షరోని, మహ లక్ష్మి, ప్రవల్లిక, నందిని, ఈశ్వరమ్మ, ఎం.వి.మహాలక్ష్మి, రవితేజలు హ్యామర్, జావెలిన్, షాట్ పుట్, హైజంప్, లాంగ్ జంప్, 800 మీటర్ల రన్, హర్డిల్స్‌లో విజయం సాధించారు. వీరు 69వ స్కూల్ గేమ్స్ అండర్ 17 డివిజనల్ అథ్లెటిక్స్ పోటీలు ఒంగోలు పీవీఆర్ మున్సిపల్ బాలుర హైస్కూల్‌లో శనివారం నిర్వహిం చారు. త్వరలో జరిగే జిల్లాస్థాయి పోటీలలో పాల్గొనన్నుట్లు ప్రధా నోపాధ్యాయురాలు తులసీప్రభ, పిడి నామా అరుణ తెలిపారు. విజేతలను ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-సింగరాయకొండ

ఉపాధి హామీ పథకం అదనపు కార్యక్రమ అధికారుల సంఘం తరపున సంఘ నాయకులు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామిని ఉద్యమ అధికారులు కలిశారు. ఈ సందర్భంగా ఏపీఓ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.జీవరత్నం మంత్రితో మాట్లాడుతూ ఏపీవోలు ఎప్పటి నుంచో ఎదుర్కొంటున్న పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బి.జీవరత్నం, ఉపాధ్యక్షులు కె.చిన్నకొండయ్య, జాయింట్ సెక్రెటరీ ఆర్.ధనుంజయవర్మ, ట్రెజరర్ జి.రాంబాబు, గౌరవ సలహాదారులు కె.సుభాషిని, యూనియన్ సభ్యులు కె.మాచర్ల, ఎం.జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

10, 11 తేదీల్లో ఎంపీ మాగుంట పర్యటన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ఈ నెల 10, 11 తేదీలలో పలు కార్యక్రమాలలో పాల్గొనను న్నారు. ఈ నెల 10న సాయంత్రం ఐదు గంటలకు ఒంగోలు ఎంపి కార్యాలయంలో ప్రజలకు అందుబా టులో ఉంటారు. రాత్రి 7.30 గంటలకు ఒంగోలు సం తపేటలోని సాయిబాబా గుడిలో మతంపల్లి దక్షిణామూర్తి ఆధ్వర్యంలో శివపార్వతుల కళ్యాణ మహోత్సవంలో ఎంపీ పాల్గొంటారు. ఈనెల 11న ఉదయం 8 గంటలకు ఒంగోలు ఎంపీ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. 10.30 గంటలకు కనిగిరి అసెంబ్లీ నియోజకవర్గం పిసిపల్లి మండలం లింగన్నపాలెంలో ఎంఎస్ఎంఈ పార్కు ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి ఎంపి మాగుంట పాల్గొంటారు. సాయంత్రం 3 గంటలకు ఒంగోలు ఎంపి కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు.

సందడిగా కార్తీక వనభోజనాలు

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి ఆర్యవైశ్య కార్తీక మాస వనభోజన మహోత్సవాలు ఎటీఆర్ గార్డెన్స్‌లో ఆదివారం వైభవంగా నిర్వహించారు. జాతీయ వాసవి సత్ర సముదాయాల చైర్మన్, శ్రీశైల దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ మెంబర్ దేవకి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో మరకత శివలింగానకు అభిషేకములు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఎంతో ఘనంగా గోపూజ కార్యక్రమం ఆర్యవైశ్య మహిళలు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం ఆలయ ప్రధాన అర్చకులు అజయ్ కుమార్ శర్మ మరియు శ్రీశైలం నుండి వచ్చిన అర్చకులు స్వామివారి ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వచ్చిన ఆర్యవైశ్య మహిళలకు స్నాక్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో లక్కీడిప్ ద్వారా పలు రకాల గిఫ్టులు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. అలాగే ఎటీఆర్ గార్డెన్స్ అధినేత ఆవుల తిరుపతిరెడ్డి దంపతులను ఆర్యవైశ్య సంఘం కమిటీ దేవకి వెంకటేశ్వర్లు ఘనంగా సత్కరించారు. అనంతరం వనభోజన మహోత్సవం కార్యక్రమం ఆటపాటలతో అలరించారు. పట్టణంలో అన్ని ఆర్య వైశ్యుల కుటుంబాలకు ప్రత్యేక ఫ్యామిలీ కూపన్ల ద్వారా పట్టు చీరలు శ్రీశైలం దేవస్థానం నుంచి తీసుకొని వచ్చిన పసుపు కుంకుమ, విభూది, రుద్రాక్షలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవకి శ్రీనివాసులు, దేవకి సుబ్రహ్మణ్యం, కొలిపర్తి వెంకటస్వామి, బచ్చు వెంకట రమేష్, నార్లపాటి మల్లికార్జునరావు, కోట కొండలు, ఆర్యవైశ్య కార్యనిర్వాహక సభ్యులు పాల్గొన్నారు.

పూజలు నిర్వహిస్తున్న ఆర్యవైశ్య నాయకులు

ఘనంగా అయ్యప్ప కలశ ప్రతిష్ట

ప్రజాశక్తి-చీమకుర్తి

స్థానిక హరిహర క్షేత్రంలో శిద్దా వెంకటేశ్వర్లు, వెంకటసుబ్బమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అయ్యప్ప కలశ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర మాజీ మంత్రి శిద్దా రాఘవరావు లక్ష్మీ పద్మావతి దంపతుల ఆధ్వర్యంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం ప్రతి ఏడాదిలో అయ్యప్ప పడి భజన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గత పాతికేళ్లుగా వస్తున్న ఆనవాయితీ ప్రకారం శిద్దా వెంకటేశ్వర్లు వెంకటసుబ్బమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అయ్యప్ప, భవాని, శివ భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అన్నదాన కార్యక్రమం స్వాములు దీక్షలు 40 రోజులపాటు అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శిద్దా ట్రస్ట్ నిర్వాహకులు శిద్దా పాండురంగారావు సుధావలి దంపతులు, శిద్దా సుధాకర్ దంపతులు, కృష్ణ సాయి గ్రానైట్స్ అధినేత శిద్దా హనుమంతరావు, శిద్దా పెదబాబు దంపతులు, శిద్దా నాగేశ్వరరావు, శిద్దా సాయిబాబు, బొమ్మిశెట్టి సుబ్రహ్మణ్యం, శిద్దా సురేష్, శిద్దా కాశీ విశ్వేశ్వరరావు, దీక్షా స్వాములు, వాసవి మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కలశ ప్రతిష్టలో పాల్గొన్న మాజీ మంత్రి శిద్దా రాఘవరావు

సరుకులు అందజేసిన రోటరీ క్లబ్ సభ్యులు

వృద్ధాశ్రమానికి సరుకులు అందజేత

ప్రజాశక్తి-తాళ్లూరు

రోటరీ క్లబ్ అధ్యక్షులు బోయిళ్ల నాగేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో క్లబ్ సభ్యుల సహకారంతో సుమారు రూ.40 వేల విలువైన వస్తువు లను ఆశ్రమవాసులకు వితరణగా అందజేశారు. అందజేసిన వస్తువులలో బియ్యం, కందిపప్పు, వంట నూనె, సీలింగ్ ఫ్యాన్లు, పంచలు, లంగీలు, వద్దులకు అవసరమైన రోజువారీ మందులు, కొన్ని రోజులకు సరిపడా తాజా కూరగాయలు, పండ్లు ఉన్నాయి. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఆశ్రమంలోని వృద్ధుల మౌలిక అవసరాలు తీర్చాలనే సదుద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. నా పిలుపుకు స్పందించి, ఈ సేవలో భాగస్వాములైన రోటరీ సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ అంబవరపు నారాయణరెడ్డి, సభ్యులు కర్ర భాస్కర్‌రెడ్డి, రెడ్డిమాసు శీను, ఎదురు నారాయణరెడ్డి, సానికొమ్ము తిరుపతిరెడ్డి, కోటేశ్వరరావు, ట్రస్ట్ మెంబర్స్ వాసుదేవరెడ్డి, దారం వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బస్టాండులో నీడ కరువై.. ప్రయాణికుల ఇక్కట్లు

ప్రజాశక్తి - బాపట్ల

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ పెరిగింది. స్త్రీ శక్తి పథకంతో మహిళా ప్రయాణికుల సంఖ్య పెరగడంతో పాత బస్టాండులో ప్రయాణికులకు నిలువ నీడ కరువైంది. ప్రస్తుతం ఉన్న బస్సు షెల్టర్ ప్రయాణికులకు నీడ కల్పించలేకపోతోంది. ప్రతినిత్యం పెరుగుతున్న ప్రయాణికుల దృష్ట్యా ప్రయాణికులకు అదనపు సౌకర్యాలు కల్పించాల్సిన అవసరాన్ని ఆర్టిసి అధికారులు, ప్రజాప్రతినిధులు గుర్తించాలి. బాపట్ల నుండి ఇతర ప్రాంతాలకు బస్సుల్లో ప్రయాణించే పొన్నూరు, గుంటూరు, రేపల్లె, చెరుకుపల్లి, మచిలీపట్నం, నిజాంపట్నం ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు బస్సుల కోసం గంటల తరబడి వేచి ఉండే పరిస్థితి ఏర్పడింది. పాత బస్టాండులో ఉన్న షెల్టర్ అవకాశం ఉన్నంతమేర విస్తరించాల్సిన ఆవశ్యకత పరిశీలించాలని ప్రయాణికులు కోరుతున్నారు. దీనికి తోడు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణాలు కొనసాగించిన రోజుల్లో ప్రధాన రహదారుల వెంట గ్రామీణ ప్రాంతాల ప్రయాణికుల అవసరాలు గుర్తించి అనేక గ్రామాల వద్ద ప్రధాన రహదారుల వెంట ఆర్టీసీ బస్సు షెల్టర్లు నిర్మించారు. కాలగమనంలో కొన్ని ఆక్రమణకు గురికాగా కొన్ని నిరుపయోగంగా ఉన్నాయి. ప్రస్తుతం మహిళా ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో గ్రామాల నుండి ప్రధాన రహదారులు వద్ద ఆర్టీసీ బస్సుల కోసం ఎండలోనే వేచి ఉండాల్సి వస్తోంది. పలుచోట్ల బస్సు షెల్టర్లను పునరుద్ధరించి ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ఆధునికరించాల్సి ఉంది.

టిక్కెట్టుకొనే ప్రయాణికులకు దొరకని సీట్లు

శ్రీ శక్తి పథకంతో ఎక్స్ ప్రెస్ బస్సుల్లో ఉచితంగా మహిళలకు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆర్డినరీ బస్సులతో పాటు ఎక్స్ ప్రెస్ బస్సులు మహిళలతో నిండిపోతున్నాయి. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించిందే కాని అందుకు తగ్గట్టు బస్సుల సంఖ్య పెంచకపోవడంతో ఈ పరిస్థితి నెలకొని ఉంది. దీంతో టిక్కెట్ కొని ప్రయాణం చేసే ప్రయాణికులకు సీట్లు దొరక్క నిలబడి ప్రయాణం చేయాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. మహిళలకు ఉచిత ప్రయాణం ఆర్థిక స్వాలంబన అయినప్పటికీ బస్సుల సంఖ్య పెంచక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎక్స్ ప్రెస్, ఆర్డినరీ బస్సుల్లో ప్రయాణాలు కొనసాగించడం కష్టమై అల్ట్రా డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సుల్లోనే చార్జీ అదనమైన ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని పలువురు ప్రయాణికులు వాపోయారు. ఇప్పటికైనా పెరిగిన ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని అదనపు బస్సులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పాత బస్టాండు సెంటర్‌లో ఎండలోనే వేచిఉన్న ప్రయాణికులు

ఉచిత బస్సు ప్రయాణాల్లో మార్పుకు శ్రీకారం

మహిళలకు ప్రభుత్వం కల్పించిన ఉచిత బస్సు ప్రయాణంలో స్వల్ప మార్పులు చేసే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తుంది. ప్రస్తుతం ఉచిత బస్సు ప్రయాణానికి కొనసాగుతున్న ఆధార్ కార్డును స్కాన్ సిస్టం ద్వారా ఉచిత ప్రయాణానికి కొత్త విధానాన్ని ప్రవేశపెట్టనుంది. ఉచిత ప్రయాణానికి ఆధార్ కార్డుతో ప్రయాణికులు ఎక్కడి నుండి ఎక్కడికి వెళ్లాలో స్కానింగ్ చేస్తారు. ఒక్కసారి ఆధార్ కార్డు స్కాన్ చేశాక తిరిగి మళ్లీ తిరుగు ప్రయాణం చేయాలంటే 24 గంటలు ఆగాల్సిందే. ఈ రోజు ఒకసారి ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణానికి ఆధార్ కార్డు స్కానింగ్ ద్వారా ప్రయాణం చేస్తే మళ్లీ ప్రయాణించేందుకు ఆ స్కానర్‌తో జీరో టికెట్ ఇచ్చేందుకు నిరాకరిస్తుంది. దీంతో రోజుకు ఒక్కసారే ఎక్కడి నుండి ఎక్కడికైనా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేయొచ్చు. ఉదాహరణకు బాపట్ల నుండి చీరాలకు వెళ్లేంతవరకు ఉచితంగా ఆధార్ కార్డు ఉపయోగపడుతుంది. తిరుగు ప్రయాణంలో స్కాన్ విధానంతో ఆధార్ కార్డు ప్రయాణానికి ఉపయోగపడదు. బాపట్ల నుండి ఒంగోలుకు ప్రయాణం చేయాలంటే బాపట్ల నుండి ఒంగోలు వరకు నేరుగా బస్సు లేని కారణంగా బాపట్ల నుండి చీరాల వరకు మహిళల ఉచిత ప్రయాణానికి ఆధార్ స్కానర్ ద్వారా టికెట్ ఇస్తారు. అదే ప్రయాణికురాలు చీరాల నుండి ఒంగోలు వెళ్లాలంటే బస్సు ఎక్కితే ఉచిత ప్రయాణం కుదరదు. ఒక్కసారి ఆర్టిసి బస్సు ఎక్కి ఆధార్ కార్డు స్కాన్ చేసిన తర్వాత మళ్లీ ఆ రోజుకు ఉచిత ప్రయాణంకు ఆధార్ పని చేయదు. ఇక రెండో రోజే మళ్లీ ఆధార్ పని చేస్తుంది. ఇక తప్పనిసరి పరిస్థితుల్లో తిరుగు ప్రయాణంలో టికెట్ కొని ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఎదురు కానుంది. ఈ విధానాన్ని ప్రవేశపెట్టాలనే యోచనతో ఆర్టీసీ 2000 స్కానర్ టింలు తయారు చేయిస్తున్నట్లు తెలిసింది. కేవలం ఉచిత ప్రయాణానికే కాక సాధారణంగా అన్ని రకాల టికెట్ల వినియోగానికి ఈ టింలు తయారవుతున్నాయని ఆర్టీసీ అధికారులు అనధికారికంగా చెబుతున్నారు. అమలులోకి వస్తే ప్రయాణికుల రద్దీ తగ్గుతుందని అంటున్నారు.

నివాళులర్పిస్తున్న వైసిపి నాయకులు

బ్రహ్మారెడ్డి మరణం వైసిపికి తీరని లోటు

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని వెల్లలచెరువుకు చెందిన వైసిపి మాజీ మండల అధ్యక్షులు యర్రంరెడ్డి బ్రహ్మారెడ్డి (53) ఆకస్మిక మృతి వైసిపికి తీరని లోటని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కల్లి అంజనీ ప్రసాదరెడ్డి, రైతు విభాగం జిల్లా కార్యనిర్వాహక సభ్యులు కేసరి చెన్నారెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి పోపూరి వెంకయ్య తెలిపారు. గుండెపోటుతో ఆయన శనివారం మృతి చెందటంతో ఆదివారం ఉదయం వెల్లలచెరువులోని స్వగృహంలో ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. బ్రహ్మారెడ్డికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బ్రహ్మారెడ్డి మృతి పట్ల విదేశాల్లో ఉన్న వైసిపి ఇన్‌చార్జి చింతలపూడి అశోక్ కుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వైసిపి అధ్యక్షులు ఊట్ల నాగేశ్వరరావు, గడ్డం సుబ్బారెడ్డి, నర్సిరెడ్డి, భాష పాల్గొన్నారు.

ప్రమాదంలో మృతి చెందిన యువకుడు

లారీ ఢీ కొట్టడంతో యువకుడు మృతి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ముందు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక నుండి వేగంగా వస్తున్న లారీ ఢీ కొట్టడంతో ద్విచక్ర వాహనంపై ఉన్న యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన 216 జాతీయ రహదారిపై ఆదివారం జరిగింది. ఎస్ఐ ఎ శివయ్య కథనం ప్రకారం గుంటూరు పట్టణానికి చెందిన మహమ్మద్ వలి (27) అనే వ్యక్తి చెరుకుపల్లి మండలం గూడవల్లిలో యువతిని వివాహం చేసుకున్నాడు. ఆదివారం ఉదయం గుంటూరు నుండి గూడవల్లికి వచ్చి అక్కడి నుండి రేపల్లెకు తన వ్యక్తిగత పనులపై వెళ్లి తిరిగి వస్తుండగా సూరేపల్లి పరిధిలోని ఫ్లైఓవర్ దిగుతుండగా వెనుక నుండి వేగంగా లారీ దూసుకు వచ్చి బైకును ఢీ కొట్టింది. ఘటనలో వలి అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుని భార్య పి సువర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఆర్థిక సహాయం అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

క్రీడాకారిణికి ఆర్థిక చేయూత

ప్రజాశక్తి - చీరాల

జాతీయ స్థాయి థైక్వాండో క్రీడా పోటీలకు ఎంపికైన కెజిఎం బాలికోన్నత పాఠశాల విద్యార్థిని షేక్ తాహిరాకు వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు రూ.25వేల ఆర్థిక సహాయం స్థానిక ఎన్‌విఎస్ అండ్ ఎస్‌జెఆర్ ఆర్య వైశ్య కళ్యాణ మండపం నందు ఎన్ఆర్ అండ్ పిఎం హైస్కూలు వాకర్స్ అసోసియేషన్ సమావేశంలో డిస్ట్రిక్ట్ గవర్నర్ పెద్ది శివరామ ప్రసాద్, ట్రెజరర్ లఘువరపు సత్యనారాయణ చేతుల మీదుగా అందజేశారు. తైక్వాండో స్టేట్ గోల్డ్ మెడల్ సాధించిన అరుణాచల్ ప్రదేశ్ ఇటానగర్‌లో ఈనెల 26 నుండి డిసెంబర్ 2 వరకు జరుగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఖర్చుల నిమిత్తం నగదు సహాయం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పోలుదాసు రామకృష్ణ, చారగుళ్ళ గురుప్రసాద్, నారాయణ మూర్తి, శివ రామప్రసాద్, లయన్ మద్దు వెంకట సుబ్బా రావు, చేబ్రోలు బాబాజీరావు, సుభాషిణి, గోపు సాంబశివ రావు, అమరా వీరాంజనేయులు, గుర్రం బద్రినాథ్, చింతా రమేష్, డివి సురేష్, దరియా సాహెబ్, నాగ వీరభద్రాచారి, సుధాకరరావు, లాల్, డాక్టర్ బాబూరావు పాల్గొన్నారు.

అతివేగంతో ప్రమాదానికి గురికావొద్దు

ప్రజాశక్తి - బాపట్ల

అతివేగంతో వాహనాలు నడిపి ప్రమాదాలకు గురై ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సిఐ రాంబాబు అన్నారు. ఆదివారం సూర్యలంకకు విచ్చేసిన వాహనాలను గడియార స్తంభం వద్ద తనిఖీలు నిర్వహించి ప్రమాదాల బారిన పడవదని సూచనలు చేశారు. ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించి డ్రైవింగ్ చేయాలని అన్నారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాదని అన్నారు. రహదారి నిబంధన ఉల్లంఘించిన వారిపై జరిమానా విధించనున్నట్లు తెలిపారు.

కర్లపాలెం : ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, పరిమిత వేగంతో వాహనాలు నడపాలని ఎస్ఐ రవీంద్ర తెలిపారు. కర్లపాలెం సెంటర్లో జాతీయ రహదారిపై వాహన దారులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలని చెప్పారు. కారులో ప్రయాణించే వారు సీటు బెల్ట్ పెట్టుకోవాలని చెప్పారు. మైనర్లకు వాహనాలు ఇవ్వద్దని, మద్యం సేవించి వాహనాలు నడుపవద్దని అవగాహన కల్పించారు.

సూచనలు చేస్తున్న బాపట్ల సిఐ రాంబాబు

బట్టిప్రోలు : ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అందుకు భిన్నంగా వ్యవహరిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని ఎస్ఐ ఎం శివయ్య హెచ్చరించారు. వాహన చోదకులకు ఆదివారం అవగాహన కల్పించారు. హెల్మెట్ వినియోగం వలన అనుకోని ప్రమాదం జరిగితే తల భాగంలో దెబ్బ తగలకుండా ప్రాణాన్ని కాపాడుకునేందుకు సహాయ పడుతుందని అన్నారు. చిన్నపిల్లలకు ద్విచక్ర వాహనాలు అప్పగించరాదని చెప్పారు. ఎవరైన మైనర్ పిల్లలు వాహనాలు నడుపుతూ కనిపిస్తే వారి తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కాల్వలో నీళ్లు బయటకు వెళ్లేదెలా?

ప్రజాశక్తి - వేమూరు

తుఫాను ప్రభావం తగ్గిపోయి 10రోజులు గడుస్తున్నప్పటికీ నేటికీ మురుగు కాలువలో నీరు తగ్గలేదు. దీంతో పంట పొలాల్లో నీరు నిలబడిపోయింది. దీనివలన పైరుకు తెగుళ్లు, దోమ ఉధృతి పెరుగుతుందని రైతులు వాపోతున్నారు. తాడిగిరిపాడు, పెనుమర్రు గ్రామాల పంట పొలాల నుండి విడుదలయ్యే మురుగు నీరు కోడిపర్రు గ్రామం పక్కగా కాలువ ద్వారా ప్రవహించి కనగాల అప్లుయేంట్ కాలువలో కలుస్తుంది. ఈ కాలువను ఈపాటికే అనేకసార్లు ఉపాధి హామీ పథకం ద్వారా పనులు జరిపించినప్పటికీ పూడికతీత పూర్తిస్థాయిలో చేపట్టలేదు. దీంతో మురుగనీరు పారుదల కావడం లేదని ఆ ప్రాంత రైతులు వాపోతున్నారు. ఈ కాలువలో నీరు తగ్గకపోవడంతో తుఫానుకు పంట పొలాల్లో చేరిన అధిక వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేక పొలాల్లోనే మోకాటి లోతు నీరు నిలబడింది. నేల వాలిన పైరు నీటిలో మునిగి దెబ్బ తింటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మురుగు కాలువలను ఉపాధి హామీ పథకం ద్వారా పనులు జరిపించడంతో పూడికతీత పూర్తి స్థాయిలో లేకపోవడంతో మురుగు నీరు బయటకు వెళ్లే పరిస్థితి లేదు. ఉపాధి హామీ పనులకు మురుగు కాలువలను మినహాయించాలని రైతుల కోరుచున్నారు.

పెనమర్రు గ్రామ మురుగు కాలువ దుస్థితి

కార్యకర్తలతో మాట్లాడుతున్న వరికూటి అశోక్ బాబు

వైసిపి సంతకాల సేకరణ

ప్రజాశక్తి - వేమూరు

చుండూరు మండలంలోని వలివేరు గ్రామంలో ఆదివారం జరుగుతున్న కోటి సంతకాల సేకరణను వైసీపీ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యకర్తలకు ఆయన సూచనలు చేశారు. వైఎస్ జగన్మోహనరెడ్డి చేపట్టిన వైద్య కళాశాలల ప్రైవేటు పరం చేయడానికి చంద్రబాబు పూనుకున్నాడని అన్నారు. దీనిని తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

చీరాల : వైసిపి ఇన్‌చార్జి కరణం వెంకటేష్ బాబు ఆదేశాల మేరకు కోటి సంతకాల సేకరణ కొత్తపేటలో శనివారం నిర్వహించారు. వైద్య కాలేజీల ప్రవేటీకరణ విధానాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వానికి ప్రజల అభిప్రాయాలు తెలియజేసేందుకే సంతకాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్ హుమాయున్ కబీర్, జోగిరాజు, వంశి పాల్గొన్నారు.

నిలిచిన 'వి కావేరి' బస్సు

ఇబ్బందులు పడ్డ ప్రయాణికులు

ప్రజాశక్తి - సంతమాగులూరు

'వి కావేరి' ట్రావెల్స్ బస్సు తిరుపతి నుంచి హైదరాబాద్‌కు 36 మంది ప్రయాణికులతో వెళ్తూ ఆదివారం వేకువ జామున 3 గంటల సమయంలో మండలంలోని ఏల్చూరు వద్ద సాంకేతిక కారణాలతో నిలిచిపోయింది. బస్సు ఆగిపోయిన విషయం గురించి డ్రైవర్లు తమ యాజమాన్యానికి సమాచారం అందించారు. అయితే బస్సు ఎంతకు బయలు దేరక పోవడంతో ప్రయాణికులు ప్రశ్నించగా చిన్నపాటి సమస్య వచ్చిందని, కొద్దిసేపట్లో బయల్దేరుతుందని చెప్పారు. తెల్లవారుతున్న బస్సు యాజమాన్యం పట్టించుకోలేదు. అంతసేపు రోడ్డుపై మహిళలు, చిన్నారులు అవస్థలు పడ్డారు. దీంతో ప్రయాణికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకుని ట్రావెల్స్ యాజమాన్యంతో మాట్లాడి వేరే బస్సుల్లో ప్రయాణికులను గమ్య స్థానాలకు పంపించారు.

మార్కాపురం జిల్లా ఖాయం!

మంత్రివర్గ ఉప సంఘం సుముఖత!!

ప్రజాశక్తి-మార్కాపురం

త్వరలో మార్కాపురం జిల్లా కాబోతోందనే సంకేతాలు వెలువడుతున్నాయి. కూటమి ప్రభుత్వం కొత్త జిల్లాల ఏర్పాటుకు సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. అధికారుల్లోనూ కొత్త జిల్లాల ఏర్పాటులో కదలిక వచ్చింద నేది సమాచారం. మంత్రివర్గ ఉప సంఘం కూడా మార్కాపురం జిల్లా ఏర్పాటు విషయంలో సానుకూలత వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. మొత్తానికి మార్కాపురం జిల్లాపై ఆశలు చిగురిస్తున్నాయి!

మార్కాపురం జిల్లా డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. గత వైసిపి ప్రభుత్వంలో జిల్లాల పునర్విభజన నేపథ్యంలో మార్కాపురం జిల్లా అవుతుందని భావించారు. కానీ అప్పట్లో జిల్లా కేంద్రానికి అర్హత కలిగినప్పటికీ అందుకు మార్కాపురం నోచుకోలేదు!

ప్రకాశం జిల్లా కేంద్రమైన ఒంగోలుకు మార్కాపురం ప్రాంతం విసిరేసినట్లుగా ఉంటుంది. మార్కాపురం రెవెన్యూ డివిజన్‌లోని గిద్దలూరు, యర్రగొండపాలెం నియోజకవర్గాలు మరింత దూరంలో ఉన్నాయి. నల్లమల అటవీ ప్రాంతం నుంచి సముద్ర తీరం సమీపంలోని ఒంగోలుకు చేరుకోవాలంటే 200 కిలోమీటర్ల మేర ప్రయాణం చేయాల్సిన గ్రామాలే ఇక్కడ ఎన్నో ఉన్నాయి. సుదూరంలోని జిల్లా కేంద్రమైన ఒంగోలుతో ఇక్కడి ప్రజలు పరిపాలనా సౌలభ్యం కోల్పోతున్నారు. స్థానికంగా సకాలంలో ప్రజలకు అవసరమైన పనులు జరగకపోవడం, ఉన్నతాధికారులను ఆశ్రయించాలన్నా... సుదూరంలో ఉన్నందున వ్యయ ప్రయాసలతో ఇక్కట్లకు గురికాక తప్పడం లేదు.

మార్కాపురం జిల్లా మ్యాప్

పశ్చిమ ప్రకాశంలోని దర్శి, కనిగిరి, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాలకు ఎటు చూసినా మార్కాపురం 60 కిలోమీటర్ల దూరానికి మించదు. మార్కాపురం జిల్లా ఏర్పాటుతో పశ్చిమ ప్రకాశంలోని ప్రజలందరికీ పరిపాలనా సౌలభ్యం అందుబాటులోకి రానుంది.

ఇక్కడి ప్రజల డిమాండ్‌ను కూటమి ప్రభుత్వం గత ఎన్నికల్లో సొమ్ము చేసుకుంది. ఎన్నికల్లో సిఎం చంద్రబాబు మార్కాపురం జిల్లా చేస్తామని గట్టి హామీ ఇచ్చారు. ఆ హామీ కారణంగా తెలుగుదేశం పార్టీ ఎన్నికల్లో లబ్ధిపొందింది. అధికారంలోకి రాగానే చేస్తామని చెప్పి కొంత జాప్యం చేసినా.. ఎట్టకేలకూ జిల్లాపై కసరత్తు ప్రారంభించినట్లు తెలిసింది. ఇచ్చిన హామీని నిలబెట్టుకునే పనిలో ఉన్నారు. ఆయన ఆదేశాలతోనే ఇటీవల సిసిఎల్ఎ ఉన్నతాధికారులు ఇక్కడి జిల్లా అధికారులను నివేదిక కోరినట్లు తెలిసింది. తాజాగా జరిగిన మంత్రివర్గ ఉప సంఘం భేటీలోనూ ఇతర ప్రాంతాలతో పాటు మార్కాపురం జిల్లా అంశం చర్చకు వచ్చింది. మార్కాపురం జిల్లా అవసరమని కూడా మంత్రివర్గ ఉప సంఘం భావించినట్లు తెలిసింది. సిఎం చంద్రబాబు అధ్యక్షతన జరగనున్న మంత్రివర్గ సమావేశంలో అదనపు జిల్లా అంశం చర్చకు రానున్నట్లు తెలిసింది. అదే సందర్భంగా మార్కాపురం జిల్లాగా ఆమోదం పొందనుందనేది సమాచారం. 2026 జనవరిలో మార్కాపురం జిల్లా కేంద్రంగా ఏర్పాట్లయే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి!

అబ్దుల్ గఫార్‌కు

రాష్ట్ర ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయ పురస్కారం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీన జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా ప్రకటించిన రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయ పురస్కారాలకు యర్రగొండపాలెం జడ్పిహెచ్ఎస్ ఉర్దూ పాఠశాలలో ఉర్దూ ఎస్‌జిటిగా పని చేస్తున్న సయ్యద్ అబ్దుల్ గఫార్ ఎంపికయ్యారు. అబ్దుల్ గఫార్ ఉర్దూ భాషా బోధనలో చూపించిన ప్రతిభ, విద్యార్థులలో భాష పట్ల ఆసక్తి పెంచిన తీరును గుర్తించి ఈ పురస్కారం అందజేయాలని రాష్ట్ర ఉర్దూ అకాడమీ నిర్ణయించింది. ఈ నెల 11న విజయవాడలో జరిగే కార్యక్రమంలో సయ్యద్ అబ్దుల్ గఫార్ రాష్ట్ర ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయ పురస్కారం అందుకోనున్నారు. స్థానిక విద్యా వర్గాలు, సహచర ఉపాధ్యాయులు ఆయన ఎంపికపై ఆనందం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశారు.

కలియ తిరుగుతూ.. సమస్యలు తెలుసుకుంటూ..

పట్టణాభివృద్ధిలో కమిషనర్ చొరవ ● రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం ● ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి సహకారంతో మరిన్ని అభివృద్ధి పనులు

ప్రజాశక్తి-గిద్దలూరు

గిద్దలూరు మున్సిపల్ కమిషనర్ ఇవి రమణబాబు తన పరిపాలనతో గిద్దలూరు పట్టణ ప్రజలలో తనకం టూ ఓ ప్రత్యేక ముద్ర వేసుకుంటున్నారు. మార్నింగ్ వాక్‌లో మున్సిపల్ కమిషనర్ ఇ.వి రమణబాబు పట్టణం లో వాడవాడలా కలియ తిరుగుతూ.. సమస్యలను తెలు సుకొని వాటికి పరిష్కార మార్గాలను చూపుతున్నారు. ఆయన గిద్దలూరు కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి పట్టణంలో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. శుభోదయం గిద్దలూరు అంటూ పట్టణంలోని వార్డులలో ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగితెలుసు కుంటూ, వాటికి శాశ్వత పరిష్కార మార్గాలను చూపుతున్నారు. ఆయన బాధ్యతలు చేపట్టిన మొదటి రోజు నుంచే వార్డులలో మార్నింగ్ వాకింగ్ చేస్తూ వార్డులోని కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరిస్తూ మీ వార్డులో ఏమైనా సమస్యలున్నాయా అంటూ సమస్యలు తెలుసుకుని వాటికి పరిష్కార మార్గాలు చూపుతున్నారు. క్షేత్రస్థాయిలో తిరిగితేనే ప్రజల సమస్యలు తనకు తెలుస్తాయని తద్వారా ప్రజల సమస్యలను పరిష్కరించడానికి మార్గం సులువవుతుం దని అంటున్నారు ఆయన.

అర్బన్ కాలనీలో రూ.13 లక్షలతో సీసీ రోడ్డు

పట్టణంలోని అర్బన్ కాలనీ ఏర్పడి సుమారు 30 సంవత్సరాలు దాటినప్పటికీ ఇంకా సరైన మౌలిక సదుపాయాలు లేక అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆ వార్డులో పర్యటించిన కమిషనర్ దృష్టికి అక్కడి కాలనీవాసులు తమ సమస్యలు విన్నవించుకున్నారు. స్పందించిన కమిషనర్ ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిల్ సభ్యుల సహకారంతో అక్కడ అర్బన్ కాలనీ మొదటి లైన్‌లో రూ.13 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించారు. ఇంకా పలు విడతలలో అర్బన్ కాలనీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఆయన కాలనీ వాసులకు తెలిపారు.

స్థానికులతో శ్రీరామ్ నగర్ రోడ్డు పరిశీలిస్తున్న కమిషనర్

ఎస్టీ కాలనీలో రూ.10 లక్షలతో సీసీ డ్రైన్లు

పట్టణంలోని ఎస్టీ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో అక్కడి కాలనీవాసులు డ్రైనేజీ కాలువలు నిర్మించాలని కమిషనర్ రమణబాబును కోరగా వెంటనే మున్సిపల్ కౌన్సిల్ సభ్యుల సహకారంతో అక్కడ రూ.10 లక్షలతో సీసీ డ్రైన్ నిర్మిస్తున్నారు. అలాగే అక్కడ త్వరలో కౌన్సిల్ సభ్యుల ఆమోదంతో సీసీ రోడ్లు కూడా నిర్మిస్తామని ఆయన అక్కడి కాలనీ వాసులకు తెలిపారు.

శ్రీరామ్ నగర్‌లో రూ.20 లక్షలతో సీసీ రోడ్లు

పట్టణంలోని శ్రీరామ్ నగర్‌లోని సీసీ రోడ్ల నిర్మాణానికి కమిషనర్ రమణబాబు కీలక కృషి చేశారు. శ్రీరామ్ నగర్ హిల్ ఏరియాలో సీసీ రోడ్లు లేకపోవడంతో వర్షాలు పడిన ప్రతిసరి అక్కడి ప్రజలు ఆ వీధుల గుండా రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు ఈ సమస్యను కమిషనర్‌కు అక్కడి ప్రాంత వాసులు విన్నవించగా స్పందించిన కమిషనర్ శ్రీరామ్‌నగర్ మెయిన్ రోడ్డులో రూ.10 లక్షలతో, శ్రీరామ్‌నగర్ హిల్ రోడ్డు వన్ రూ.5 లక్షలతో, శ్రీరామ్ నగర్ హిల్ రోడ్డు టు రూ.5 లక్షలతో మొత్తంగా శ్రీరామ్‌నగర్‌లో రూ.20 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించారు.

డ్రైనేజీ నిర్మాణాన్ని పరిశీలిస్తూ గుత్తేదారుకు సూచనలిస్తున్న కమిషనర్ రమణబాబు

రూ.64 లక్షలతో అభివృద్ధి పనులు

అర్బన్ కాలనీ, శ్రీరామ్ నగర్, ఎస్టీ కాలనీలలోనే కాక బాలకృష్ణారెడ్డి నగర్ రూ.5 లక్షలు, బిలాల్ మసీద్ సైడ్ రోడ్డు రూ.5 లక్షలు, రామాలయం రోడ్డు రూ.5 లక్షలు, విద్యానగర్ రోడ్డు రూ.5 లక్షలు ఇలా మొత్తంగా పట్టణంలో గడచిన నెలరోజులలో మొత్తంగా రూ.64 లక్షలతో అభివృద్ధి పనులు జరిగాయి.

వైద్యశిబిరంలో రోగులకు చికిత్స అందిస్తున్న వైద్యులు

వైద్య శిబిరంలో 130 మందికి సేవలు

ప్రజాశక్తి-సంతనూతలపాడు

సంతనూతలపాడులోని సేవా సంకల్ప చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో ఆదివారంనాడు ఒంగోలు శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారి సౌజన్యంతో స్థానిక సేవా సంకల్ప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరంలో 130 మందికి వివిధ పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందించారు. ట్రస్ట్ ఫౌండర్ పాతూరి సంపత్ తండ్రి గోవిందయ్య జ్ఞాపకార్థం ఈ మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఒంగోలు శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత, ప్రముఖ వైద్యులు చాపల వంశీకృష్ణ పర్యవేక్షణలో డాక్టర్ కొప్పోలు సౌమిత్రా పల్లవ్ రోగులకు సేవలు అందించారు. ఈ సందర్భంగా బిపి, షుగర్, తదితర పరీక్షలను ఉచితంగా శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారు అందించారు. రోగులకు ఒక నెలకు సరిపడా మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని సేవా సంకల్ప్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శనగల వెంకటరమణ, వైస్ చైర్మన్ పావులూరి నారాయణస్వామి చౌదరి తదితరులు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ జాయింట్ సెక్రెటరీ కంకణంపాటి వెంకటేశ్వర్లు, ట్రస్ట్ సభ్యులు వేమా నాగరాజు, ఆర్ జార్జి, కొత్తపల్లి ఆంజనేయులు, ఒంగోలు శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్ షేక్ ఖాసిం సాహెబ్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ అనిల్, గోపి, రజనీకాంత్, హాస్పటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. షుగరు, బిపి, థైరాయిడ్, ఆర్థోపెడిక్, సీజన్ వ్యాధులకు సంబంధించి వైద్యులు కె సోమిత్ర పల్లవ్ రోగులకు చికిత్సలు అందించారు.

కృష్ణకిశోర్‌రెడ్డిని సత్కరిస్తున్న స్థానికులు

విగ్రహ ప్రతిష్టలో కృష్ణకిశోర్‌రెడ్డి

ప్రజాశక్తి-కొమరోలు

ప్రకాశం జిల్లా కోమరోలు మండలం రాజుపాలెం గ్రామంలో పురాతన దశ బందం చెరువుగట్టుపై గంగమ్మ తల్లి పోతురాజు, పార్వతీదేవిల నూతన విగ్రహం ప్రతిష్ట, కుంభాభిషేకం మహోత్సవానికి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గోడి ఓబుల్‌రెడ్డి గ్రామస్తుల ఆహ్వానం మేరకు గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్‌రెడ్డి ఆదేశాల మేరకు సోదరుడు తెలుగుదేశం పార్టీ నాయకులు ముత్తుముల కృష్ణ కిశోర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం దశ బందం చెరువు గట్టుపై వెలసిన గంగమ్మ తల్లి పోతురాజు పార్వతీదేవిలను గ్రామస్తులు ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో పాల్గొని పూజ, హోమంలో ధాన్యం సమర్పించి స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. తదనంతరం గ్రామస్తులు క్రిష్ణ కిశోర్‌రెడ్డికి గోడి ఓబుల్‌రెడ్డిని శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి తెలుగు యువ నాయకులు తోట వెంకటేశ్వర్లు, గిద్దలూరు పాతాళ నాగేశ్వర స్వామి దేవస్థానం కమిటీ మెంబర్ గంటా కృష్ణారెడ్డి, మల్లారపు రామస్వామి, వెంకటేశ్వర్లు(జెసిఓ), చెరువు చైర్మన్ కాజాపీరా, పాండు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా చెవిరెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

వైసీపీ ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి, మాజీ శాసనసభ్యులు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి జన్మదినాన్ని యర్రగొండపాలెంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ తన కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పార్టీకి అంకితభావంతో సేవలందిస్తున్న నాయకుడని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్ర బృందం

పశ్చిమ ప్రాంతంలో పర్యటించాలి..

- నష్టాలను పారదర్శకంగా అంచనా వేయాలి..
- రైతుసంఘం డిమాండ్

మాట్లాడుతున్న పమిడి వెంకట్రావు, జయంతిబాబు

ప్రకాశం-ఒంగోలు సిటీ

జిల్లాలో ఇటీవల మొంథా తుఫాను ప్రభావం వల్ల రైతాంగం తీవ్ర నష్టాలను చవిచూసిన నేపథ్యంలో కేంద్ర బందం పశ్చిమ ప్రాంతంలోని తీవ్రంగా దెబ్బతిన్న మండలాలను తప్పనిసరిగా సందర్శిం చాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం డిమాండ్ చేసింది. ఆదివారం నాడు ఒంగోలులో జరిగిన మీడియా సమావేశంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు జయంతిబాబు, కార్యదర్శి పమిడి వెంకట్రావు మాట్లాడుతూ జిల్లా పశ్చిమ ప్రాంతంలోని మార్కాపురం, పెద్దారవీడు, దోర్నాల, యర్రగొండపాలెం, పుల్లలచెరువు, తర్లపాడు మండలాల్లో పత్తి, మిరప పంటలు పూర్తిగా నాశనమయ్యాయన్నారు. వేలాది ఎకరాల్లో రైతులు నష్టపోయారని గుర్తు చేశారు. ఈ ప్రాంతాల పరిస్థితిని అంచనా వేయకపోతే రైతాంగానికి ఏ మాత్రం న్యాయం జరగదన్నారు. జిల్లాకు వచ్చే కేంద్ర పర్యటన బందం ఒంగోలు పరిసర ప్రాంతాల్లో మాత్రమే పర్యటించేలా అధికారులు ప్రణాళిక రూపొందించినట్లు నాయకులు పేర్కొన్నారు. దీనిని రైతుసంఘం తీవ్రంగా ఖండిస్తున్నట్లు ప్రకటించారు. ఒంగోలు చుట్టుపక్కల పర్యటనలతో కంటి తుడుపు చర్యలు చేపట్టడం వల్ల రైతాంగానికి ఎలాంటి ఉపశమనం ఇవ్వదన్నారు. పశ్చిమ మండలాల పర్యటన లేకుండా నష్టాల అంచనా సరికాదని మండిపడ్డారు. గత ఏడాది మిరప సాగు నష్టాల వలన పశ్చిమ ప్రాంత మండలాల్లో దాదాపు 10 మంది రైతులు అప్పుల బాధతో ఆత్మహత్యలకు పాల్పడ్డారని గుర్తు చేశారు.. ఈ తుఫాన్ వల్ల పరిస్థితి మరింత విషమమైందని, ప్రభుత్వం వెంటనే స్పందించాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు. పత్తి, మిరప పంటలకు ఎకరాకు కనీసం రూ.50 వేలు చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర బందం పర్యటనను పశ్చిమ మండలాల వరకు విస్తరించేలా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

పర్యాటకుల భద్రత కోసం

పటిష్ట బందోబస్తు

- డ్రోన్లు, సీసీ కెమెరాలతో నిఘా
- తీరం వెంబడి 40 సీసీ కెమెరాలు ఏర్పాటు
ఎస్పీ బి. ఉమామహేశ్వర్

తీరంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ ఉమామహేశ్వర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

మద్యం సేవించి సముద్రంలోకి దిగడం, సముద్రంలో ఈత కొట్టడం నిషేధమని, ఎవరైనా ఇటువంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ హెచ్చరించారు. మొంథా తుఫాన్ ప్రభావంతో తాత్కాలికంగా మూసివేసిన సూర్యలంక బీచ్ కి శనివారం నుండి యాత్రికులను అనుమతిస్తున్నారు. ఆదివారం జిల్లా ఎస్పీ సూర్యలంక సముద్రాన్ని సందర్శించారు. భక్తులు, యాత్రికుల భద్రతకు పోలీస్ అధికారులు తీసుకున్న రక్షణాత్మక చర్యలను పరిశీలించారు. వాచ్ టవర్స్ పై నుండి సముద్రతీరాన పోలీస్ సిబ్బంది నిర్వహిస్తున్న విధులను పరిశీలించారు. స్వయంగా డ్రోన్‌ను ఎగురవేసి అక్కడి పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు. సూర్యలంక మెరైన్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌ను సందర్శించి, యాత్రికుల భద్రతాపరంగా తీసుకోవలసిన చర్యల గురించి పోలీస్, మెరైన్ అధికారులకు, సిబ్బందికి ఆదేశాలు జారీచేశారు. ఎస్పీ మాట్లాడుతూ శనివారం నుండి సందర్శకులను సూర్యలంక సముద్రతీరానికి అనుమతిస్తున్నామని తెలిపారు. కార్తీక మాసం సందర్భంగా సోమవారాలు పవిత్ర స్నానాలు ఆచరించడానికి భక్తులు విశేషంగా వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో తగిన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. సూర్యలంక సముద్రతీరం వెంబడి ఎరుపు రంగు జెండాలు ఏర్పాటు చేశామని, వాటిని దాటి ఎవరు వెళ్లరాదని తెలిపారు. సముద్రం లోపల, తీరం వెంబడి గస్తీ నిమిత్తం 10 పడవలను సిద్ధం చేశామని, వీటిలో స్థానిక పోలీసులు, మెరైన్ పోలీసులు, గజ ఈతగాళ్లను నియమించామని తెలిపారు.

సముద్రతీరంలో బ్లూ కోర్ట్ వాహనాల ద్వారా పోలీస్ సిబ్బంది నిరంతర పర్యవేక్షణ నిర్వహిస్తారని తెలిపారు. డ్రోన్ల ద్వారా ఎప్పటికప్పుడు పరిస్థితులను పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. మొత్తం సూర్యలంక సముద్రతీరం కవర్ అయ్యేవిధంగా సుమారు 40 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, వాటిని మెరైన్ పోలీస్ స్టేషన్‌లోని కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో బాపట్ల డీఎస్పీ జి.రామాంజనేయులు, చీరాల డిఎస్పీ ఎం.డి.మోయిన్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ జి.నారాయణ, బాపట్ల రూరల్ సీఐ ఏమ్.శ్రీనివాసులు, చీరాల రూరల్ సిఐ పి.శేషగిరి, మెరైన్ పోలీస్ అధికారులు, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

పారిశ్రామికంగా జిల్లాను అభివృద్ధి చేయాలి

సిఐటియు జిల్లా మహాసభల్లో తీర్మానం

మహాసభల సందర్భంగా మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-దర్శి

జిల్లాను పారిశ్రామిక అభివృద్ధి చేయాలని సిఐటియు జిల్లా మహాసభలలో తీర్మానం చేశారు. సిఐటియు జిల్లా మహాసభలు ఆదివారంతో ముగిశాయి. స్థానిక పిజియన్ కాంప్లెక్స్ కల్యాణ మండపంలో నిర్వహించిన జిల్లా మహాసభలకు అధ్యక్షులు కాలం సుబ్బారావు, డికెఎం.రఫీ, పి.కల్పన, కొర్నేపాటి శ్రీనివాసరావు అధ్యక్ష వర్గం వ్యవహరించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా నిరంతరం కార్మిక పక్షాన సిఐటియు పోరాడుతోందన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాత కార్మిక వర్గానికి రక్షణగా ఉన్న 29 కార్మిక చట్టాలను రద్దు చేశారని, నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతోందని విమర్శించారు. ఈ సందర్భంగా కొన్ని తీర్మానాలను మహాసభలు ఆమోదించాయి. జిల్లాను పారిశ్రామిక అభివద్ధి చేయాలని, ఉపాధి పెంచాలని, గ్రానైట్ పరిశ్రమను రక్షించాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, కార్మిక, ప్రజా ఉద్యమాలపై ప్రభుత్వ నిర్బంధం ఆపాలని, పెన్షనర్స్ కనీస పెన్షన్ తొమ్మిది వేలుగా నిర్ణయించాలని తీర్మానించారు. ఎలక్ట్రిక్ బస్ పాలసీ ఆర్టీసీల ఉనికే ప్రమాదకరమన్నారు. స్త్రీ శక్తి పథకం అమలులో వస్తున్న సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈఎస్ఐ హాస్పిటల్ జిల్లా కేంద్రంలో నిర్మించాలి, సంక్షోభాన్ని నివారించే పలకల పరిశ్రమను కాపాడాలి వంటి మొత్తం 40 తీర్మానాలను సభ ఆమోదించింది. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో నాయకులు సిఐటియు పోరాటాలు కార్మికుల ఐక్యతను గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్, ఉపాధ్యక్షుడు జివి.కొండారెడ్డి, మరొక ఉపాధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కంకణాల ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసులు, ఆశా వర్కర్స్, యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.కల్పన, జిల్లా కార్యదర్శి తాండవ రంగారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెల్లంపల్లి ఆంజనేయులు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దేవి పిచ్చయ్య, రైతు సంఘం దర్శి మండల కార్యదర్శి సందు వెంకటేశ్వరరావు, సిఐటియు దొనకొండ మండల కన్వీనర్ చిరుపల్లి అంజయ్య, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బోడపాటి హనుమంతరావు, స్థానిక సిఐటియు నాయకులు షేక్.కాలేభాష, ఉప్పు నారాయణ, జిల్లా ప్రతినిధులు 280 మంది పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజలు అందజేసిన సమస్యల అర్జీల పై ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు అన్ని శాఖల జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ సమీక్ష నిర్వహిస్తారు. అనంతరం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి సమస్యల అర్జీలను స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌తో పాటుగా ప్రతి రెవెన్యూ డివిజన్‌లో, మండల తహశీల్దార్ కార్యాలయాలలో ప్రజల నుంచి సమస్యలపై అర్జీలను స్వీకరిస్తారని తెలిపారు. అర్జీదారులు అందజేసిన అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చన్నారు. మీకోసం. ఏపీ.జివో వి.ఇన్ వెబ్సైట్‌లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సమస్యలకు పరిష్కారం పొందాలని కలెక్టర్ తెలిపారు.

మిషన్ హరితాంధ్రప్రదేశ్ అమలుకు కృషి

- 50 శాతంగా ప్లాంటేషన్ పచ్చదనం నింపే దిశగా చర్యలు
- అన్ని ప్రభుత్వ శాఖల సహకారంతో సామాజిక వనాల పెంపకం..
- ఫారెస్ట్ డిప్యూటీ కన్సర్వేటర్ రాజశేఖర్‌రావు

ముఖాముఖి

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ప్రకాశం జిల్లాలో సామాజిక అడవుల పెంపకం ద్వారా మిషన్ హరితాంధ్రప్రదేశ్ అమలుకు కృషి చేస్తున్నట్లు డిప్యూటీ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ కె.రాజశేఖర్‌రావు పేర్కొన్నారు. సామాజిక వనాలు పెంచడం ద్వారా వాతావరణ కాలుష్యాన్ని నిలువరించడంతో పాటు పర్యావరణ అభివద్ధికి దోహదపడుతుందని ఆయన 'ప్రజాశక్తి' ముఖాముఖిలో వివరించారు.

ఒక్క రోజులోనే 5 వేల మొక్కలు..

పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర పేరున శుక్రవారం నాడు ఒక్క రోజులోనే ఒంగోలు నగరంలోని విద్యా సంస్థలు, ప్రభుత్వ సంస్థలు, ప్రధాన రహదారుల వెంట 5 వేల మొక్కలు నాటినట్లు వివరించారు. ఈ కార్యక్రమం జిల్లాలో పలు ప్రాంతాల్లో మిషన్ హరితాంధ్రప్రదేశ్ అమలుకు స్ఫూర్తి నిచ్చింది.

50 శాతం ప్లాంటేషన్‌తో..

పర్యావరణ పరిరక్షణ కోసం 50 శాతం పచ్చదనం సాధించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. దీనికి ఫారెస్ట్, నాన్ ఫారెస్ట్ ప్రాంతాల్లో 37.17 శాతం వనాలతో అభివద్ధి పరిచి, తద్వారా రాష్ట్ర వ్యాప్తంగా హరితహారం నింపడం ప్రభుత్వ లక్ష్యం. దీనికి జిల్లాలోని అన్ని గ్రామాల్లో అన్ని నివాసాల్లో ప్రజలను చైతన్యపరిచి ఇంటికి కనీసం రెండు మొక్కలు పెంచే కషి చేపడుతున్నాం. పెరటి చెట్లు పెంచడం ద్వారా గహ వినియోగం, పండ్ల చెట్లు పెంచడం ద్వారా ఆదాయం సమకూర్చుకోవడం నీడనిచ్చే చెట్ల పెంపకంతో పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుంది.

2047 నాటికి కాలుష్య నియంత్రణ..

సామాజిక అడవుల పెంపకం ద్వారా 2047 నాటికి దశల వారీగా కాలుష్య నియంత్రణ చేపట్టాలనే లక్ష్యంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రణాళికలు రూపొందించి ఆ దిశగా కృషి జరుగుతుంది. ఇందులో భాగంగా జిల్లా లోని మూడు రేంజిల(ఒంగోలు, పొదిలి, మార్కాపురం) పరిధిలోని 9 నర్సరీల (కొత్తపట్నం, టపాచెట్టు, బల్లిపల్లి, హాజీపురం, మద్రిపాలెం, తుమ్మలచెరువు, కలుజువ్వలపాడు, తోకపల్లి, బోధనంపాడు) లో 2025-26 సంవత్సరానికి 6660 హెక్టార్లలో 50.50 లక్షలు మొక్కలు పెంచే లక్ష్యం కాగా 9950 హెక్టార్లలో 62 లక్షలు మొక్కలు పెంచి లక్ష్యాన్ని అధిగమించాం.

అన్ని ప్రభుత్వ శాఖల సహకారంతో..

సామాజిక వనాల పెంపకం కోసం ఎన్ఆర్ఇజిఎస్‌తో పాటు ఐటిసి, జిటిసి, బ్యాంకులు వంటి సంస్థల ఆర్థిక సహకారంతో పాటు హార్టీ కల్చర్, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలు,పారిశ్రామిక వేత్తలు, ఇతర దాతల ఆర్థిక సహకారంతో సామాజిక భాధ్యతగా గ్రేట్ గ్రీన్ వాల్ నిర్మాణానికి కృషి జరుగుతుంది. పట్టణాలలో నివాస కాలనీలు, ప్రైవేట్ వ్యక్తులకు చెందిన ఖాళీగా ఉన్న భూములలో సామాజిక వనాల పెంపకం వేగవంతంగా జరుగుతుంది. సామాజిక వనాల పెంపకం ప్రతి ఒక్కరి సామాజిక భాధ్యతగా గుర్తించాలి.